
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం 13 నవంబరు 2025

'బొగ్గు'ట్ట భవితపై బెంగ

- బోధపడని సింగరేణి పుట్టినిల్లు భవితవ్యం
- ఏరియాలో ఏకైక ఓసీ కోయగూడెం
- పూసపల్లి ఓసీ ఏర్పాటుపై నీలినీడలు

7

సిరులు కురిపించి.. ఆ పై మూతబడి!

- ఇల్లెందు ఏరియాలో 45 గనుల మూసివేత
- తాజాగా జేకే 5 ఓసీ కూడా కనుమరుగు
- 13ఏళ్లలో 28మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసిన ఓసీ
- గనుల మూతతో ఆవేదనలో కార్మికులు



మూసిపోయిన జేకే 5 ఓసీ

సింగరేణికి జన్మనిచ్చి.. బొగ్గుగనులకు ఊపిరిపోసి నిలువెల్లా గాయాల వీణగా మారిన బొగ్గుట్ట (ఇల్లెందు) భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 1889నుంచి సింగరేణి కాలరీస్‌లో బొగ్గు ఉత్పత్తులు చేస్తున్న ఇల్లెందు ఏరియాలో సింగరేణి ప్రాభవం కొడిగడుతుందన్న ఆందోళనలో కార్మిక కుటుంబాలున్నాయి. ఒకనాడు బొగ్గుట్టలో వేలాది మంది కార్మికులు.. వేలాదిటన్నుల బొగ్గు ఉత్పత్తులతో కళకళలాడిన ఏరియాలో నేడు కేవలం కోయగూడెం ఓసీ మాత్రమే మిగిలి ఉండడం గమనార్హం. ఈ ఏరియాలో మొత్తం 45గనుల మూసివేయగా.. తాజాగా జేకే 5 ఓసీ కూడా అంతర్ధానమైంది. ఈ నేపథ్యంలో ఏరియా మనుగడ సైతం దినదిన గండంగా మారిందని, ఎప్పుడు ఏ ఏరియాను మూసివేస్తారో అన్న ఆందోళనలో సింగరేణి కార్మికులు, ఉద్యోగులున్నారు. 7

- ఇల్లెందు / ఇల్లెందుటౌన్, ఆంధ్రజ్యోతి

5,134 క్వింటాళ్ల సన్నవడ్లకు బోనస్ చెల్లింపు

- ఇప్పటి వరకు 52,260 క్వింటాళ్ల ధాన్యం కొన్నాం
- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం
- పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి చందన్‌కుమార్



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 52,260 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని.. అందులో 5,134క్వింటాళ్ల సన్నవడ్లకు రూ.500చొప్పున బోనస్ చెల్లించామని పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి చందన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రతీ రైతు నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ వానాకాలం సీజన్‌కుగాను జిల్లాలో 326ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఈ నెల 12వతేదీ నాటికి 52,260 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇక తల్లాడ, కల్లూరు పరిధిలో 101మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 5,134 క్వింటాళ్ల సన్న రకం ధాన్యానికి రూ.500 చొప్పున మొత్తం 25.67లక్షల బోనస్ సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాల్లో మూడు రోజుల్లోనే జమ చేయనున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం చివరి గింజ వరకు సేకరించి మద్దతు ధరను అందిస్తుందని చందన్ కుమార్ తెలిపారు.

అనుబంధం ఎక్కడ?



రాష్ట్రంలోనే విభిన్న పంటల సాగుకు నిలయంగా ఉన్న ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులు అధికంగానే ఉన్నా వాటి అనుబంధ పరిశ్రమలు మాత్రం ఆశించిన రీతిలో ఏర్పాటు కావడం లేదు. గతంలో ఏర్పాటైన పరిశ్రమలు మినహా దశాబ్దకాలంగా అరకొరగానే పరిశ్రమల ఏర్పాటు జరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, అవసరాలు తీర్చేందుకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పడంలో వెనుకబాటు ఉంటోంది. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రోత్సాహాలతో పరిశ్రమలు ఏర్పాటుచేసే ఔత్సాహికులకు అనేక సబ్సిడీలు అమలు చేసేవి. ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటుచేసి భూమి, నీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించి సబ్సిడీలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇచ్చే పరిస్థితి ఉండగా ఇందుకు భిన్నంగా పరిస్థితి నడుస్తోంది.

- కానరాని వ్యవసాయాధారిత కొత్త పరిశ్రమల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో దశాబ్దకాలంగా ఇదే పరిస్థితి
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడమే కారణం
- పంట ఉత్పత్తులు అధికంగా ఉన్నా.. ఫలితం అంతంతమాత్రమే..

ఖమ్మం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పరిశ్రమల ఏర్పాటుదారులకు ప్రభుత్వాల నుంచి ఎలాంటి ప్రోత్సాహం, సబ్సిడీలు ఉండకపోవడంతో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావడంలేదు. వ్యవసాయాధారిత పరిశ్రమలకు అవకాశాలు ఉమ్మడి జిల్లాలో అధికంగా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఉన్నందున అక్కడ గిరిజనేతరులు పరిశ్రమలు పెట్టేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖమ్మంజిల్లా పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నా ఇందుకు సంబంధించిన మౌలిక సదుపాయల కల్పనతో పాటు ఇండస్ట్రియల్ సెమినార్లు, అవగాహన సదస్సులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ కార్యక్రమాలు లేకపోవడం, జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు ముందడుగు వేయడంలేదు.

విభిన్న పంటలు పండుతున్నా..

ఉమ్మడిజిల్లాలో విభిన్న రకాల వ్యవసాయపంటలు పండుతున్నాయి. ఏటా సుమారు 3.50లక్షల ఎకరాల్లో పత్తి, 4.50లక్షల ఎకరాల్లో వరి, సుమారు 80వేల ఎకరాల్లో మిర్చి సాగవుతున్నాయి. వీటితో పాటు కందులు, పెసలు లాంటి పప్పుధాన్యాలు, ఆయిల్‌పామ్ విస్తరిస్తున్నాయి. మామిడి, జీడిమామిడి, బొప్పాయి, జామ, అరటి తదితర పండ్లతోటలసాగు కూడా అధికంగానే ఉంది. అయితే డిమాండ్‌కు అనుగుణంగా ఆయిల్‌పామ్ పరిశ్రమలను అశ్వారావుపేట, అప్పారావుపేటల్లో ఏర్పాటు చేయగా.. అవి విజయవంతంగా నడుస్తున్నాయి. ఇక కొణిజర్ల మండలంలో ప్రైవేటు రంగంలో గోద్రేజ్ ఆధ్వర్యంలో పామాయిల్ పరిశ్రమ రాబోతోంది. వేంసూరులో కూడా ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పరిశ్రమ నిర్మాణం కానుంది. ఇక ధాన్యానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో 130వరకు మిల్లులున్నాయి. 12వరకు జిన్నింగ్ మిల్లులు, ఒక స్పిన్నింగ్ మిల్లు ఉంది. ఇవి మినహా ఇతర పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు కావడంలేదు. పత్తి సాగు చేస్తున్న ఆదిలాబాద్, వరంగల్ తదితర జిల్లాలతో పోలిస్తే జిల్లాలో జిన్నింగ్ మిల్లుల సంఖ్య తక్కువగా ఉంది. జిల్లాలో సాగవుతున్న పత్తి దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటుచేస్తే రైతులకు (మిగతా 6వ పేజీలో)

ఆదర్శవంతంగా దానవాయిగూడెం గురుకులం

- పాఠశాల అభివృద్ధికి రూ. 3.80కోట్ల మంజూరు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కళాశాల భవన మరమ్మతు పనులకు శంకుస్థాపన



దానవాయిగూడెంలో గురుకుల పాఠశాల మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దానవాయిగూడెం గురుకులాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధి దానవాయిగూడెంలో టీజీఎస్ డబ్ల్యూఆర్ పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల భవన మరమ్మతు పనులకు బుధవారం ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గతేడాది మున్నేరు నదికి వచ్చిన భారీ వరదల కారణంగా ఈ పాఠశాలలోని విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ గడిపారని, అప్పుడు పిల్లలకు ఇచ్చిన మాట మేరకు రూ.3.80కోట్లను కేటాయించామన్నారు. పాఠశాల అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు వీటిని వినియోగించుకోవాలన్నారు. యుద్ధప్రాతిపదికన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. బాలికలు క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దానికి అనుగుణంగా వసతుల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులు సూచించారు. తమ పీఎస్సార్ ట్రస్ట్ నుంచి పాఠశాలకు గతంలో అవసరమైన ఫర్నిచర్ పంపిణీ చేశామన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మంత్రి చొరవతో బాలికల గురుకుల పాఠశాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో గురుకులాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని, పనులను నాణ్యతతో ఉండాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఖమ్మం సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలను ఉన్నతాధికారులు తనిఖీ చేస్తూ పిల్లలకు అందించే ఆహారం నాణ్యతను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్, నీటిపారుదల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ దుర్గ, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




డిసెంబరు నాటికి మార్కెట్ పునర్నిర్మాణం పూర్తవ్వాలి

- మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మీబాయి
- సీసీఐ కొనుగోలు కేంద్రాల సందర్శన

7

బ[బే]జారులో.. బీఆర్ఎస్



ఉద్యమపార్టీగా ఆవిర్భవించి.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి.. బలమైన కేడర్‌ను సంపాదించుకున్న బీఆర్ఎస్ ప్రస్తుతం బేజారవుతోంది. అధికారం కోల్పోయిన తర్వాత అంతర్గత విభేదాలు మరింత ముదిరాయి. గ్రామీణ, మండల స్థాయి మొదలుకుని నియోజకవర్గ స్థాయి వరకు ఉన్న లీడర్లు వర్గాలుగా విడిపోయి బజారుకెక్కుతున్నారు. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకునే స్థాయి నుంచి ఏకంగా జిల్లా అధ్యక్షుడిపైనే విమర్శలు గుప్పించే స్థాయికి పార్టీలో వర్గ విభేదాలు బహిర్గతమవుతున్నాయి. కాగా ఇటీవల కాలంలో జరుగుతున్న వరుస సంఘటనలతో 'కారు' రాజకీయం కుతకుతలాడుతోంది. ఈ పరిణామాలతో దిగాలు చెందుతున్న శ్రేణులు.. సందిగ్ధానికి గురవుతున్నారు. ముఖ్యనేతల పరిస్థితెలా ఉన్నా ముమ్మందు తమ రాజకీయ భవిష్యత్ ఏంటా అని దిగువశ్రేణి నాయకులు అంతర్మథనం చెందుతున్నారు.

- వర్గవిభేదాలతో కారు కుతకుత
- భద్రాద్రి జిల్లా గులాబీదళంలో అంతర్గత కుమ్ములాటలు
- ఏకంగా జిల్లా అధ్యక్షుడి పైనే విమర్శల వెల్లువ
- 'పంచాయతీ' నోటిఫికేషన్ సమయంలో పేటలో రగడ
- మండల అధ్యక్షుల నియామకాల్లోనూ తిరస్కరణలు
- పార్టీ కిందిస్థాయి శ్రేణుల్లో సందిగ్ధ పరిస్థితి

కొత్తగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బలమైన నాయకులు, స్థిరమైన కార్యకర్తలున్నారన్న భావన ఉండేది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఎనిమిది నియోజకవర్గాల్లో, పొత్తులో భాగంగా ఒక స్థానంలో పోటీ చేసిన సీపీఐ గెలుపొందాయి. ఇక భద్రాచలం నియోజకవర్గంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. ఈ విషయం పక్కనపెడితే ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న పార్టీలో ప్రస్తుతం రాష్ట్ర నాయకత్వం కానీ, జిల్లా నాయకత్వం కానీ ప్రజాసమస్యలకు సంబంధించి ఏదైనా పోరాటాలకు పిలుపునిచ్చిన సమయంలో కింది స్థాయి కేడర్ ఆ పిలుపును అందుకుని పెద్ద ఎత్తున పోరాటాలు చేసిన దాఖలాలు కనిపించని పరిస్థితి ఉందటూ కొందరు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనంతటికీ కారణం నాయకుల మధ్య సఖ్యత లేకపోవడమేనన్న అభిప్రాయాలున్నాయి. ఫలితంగానే ఎవరి వర్గానికి సంబంధించిన నేతలు పిలుపునిస్తే.. ఆ వర్గానికి చెందిన కార్యకర్తలు మాత్రమే నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, అందువల్లనే నిరసన కార్యక్రమాలు పలుచబడుతున్నాయన్న ఆందోళన నేతల్లో వ్యక్తమవుతోంది.

వరుసగా వర్గవిభేదాలు బహిర్గతం...

బీఆర్ఎస్.. భద్రాద్రి జిల్లా కేడర్‌లో నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఇటీవల కాలంలో బహిర్గతమవుతున్నాయి. పార్టీలోని నాయకులు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ బజారుకెక్కుతున్నారు. పంచాయతీ ఎన్నికల సమయంలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఏకంగా ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసిమరీ పార్టీలో జరుగుతున్న వ్యవహారాలపై మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఒంటెత్తు పోకడలు పోతున్నారని, సమావేశాలకు సైతం ఆహ్వానించడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలోనే అశ్వారావుపేట మండల సమావేశం నిర్వహించగా.. ముఖ్యనాయకులు ఎవరూ సమావేశానికి హాజరుకాకపోవడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. కాగా అశ్వారావుపేట మండలానికి సంబంధించి వర్గ విభేదాల కారణంగా మూడేళ్లుగా మండల (మిగతా 6వ పేజీలో)

గదుల్లేక.. గజగజ!

- ఖమ్మం ఎంసీహెచ్‌లో గర్భిణులు, బాలింతల అవస్థలు
- సహాయకులకూ తప్పని తిప్పలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతాశిశు సంరక్షణ విభాగం (ఎంసీహెచ్)లో బాలింతలు, శిశువులు, గర్భిణులు గజగజలాడిపోతున్నారు. ఎంసీహెచ్‌లో గదులు లేక వరండాలోనే ఉంచుతుండడంతో గర్భిణులు, బాలింతలతో పాటు వారి సహాయకులు దవాఖానా బయట చలికి వణుకుతున్నారు. ఈ ఆస్పత్రిలో నిత్యం 20 నుంచి 25కి పైగానే కాన్పులు జరుగుతాయి. మొత్తం 200 పడకల్లో గర్భిణులు, బాలింతలు ఉంటారు. జిల్లాతో పాటు పక్కజిల్లాల, శివారు గ్రామాల నుంచి సైతం పెద్దసంఖ్యలో గర్భిణులు ఇక్కడికి కాన్పు నిమిత్తం వస్తుంటారు. వీరికి సహాయకులుగా ఒకరిద్దరు వెంటుంటారు. వీరు రాత్రిపూట విశ్రాంతి పొందేందుకు ఎలాంటి గదులు కానీ హాల్ కానీ లేదు. అంతే కాదు గదులు లేకపోవడంతో కాన్పు అయిన తర్వాత శిశువులతో పాటు వరండాలో ఉండాల్సి వస్తోంది.

కొద్దిరోజులుగా వర్షాలు, చలికి ఇక్కడ ఉండే బాలింతలు, అప్పుడే పుట్టిన శిశువులు, వారికి సహాయకులుగా వచ్చిన బంధువులు, కుటుంబీకులు చలికి వణికిపోవాల్సి వస్తోంది. ఉన్న వార్డుల్లో గదులు చాలీచాలక పోవడంతో గర్భిణులు, బాలింతల సహాయకులు అవస్థలు పడుతున్నారు. వరండాలో ఆరుబయటే అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. కాన్పు తర్వాత కనీసం నాలుగు ఐదు రోజులు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తోందని, ఇలా చలికి తట్టుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉంటున్న గదులను బాలింతలకు కేటాయించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఎంసీహెచ్‌కు అదనంగా మరొక అంతస్థు ఏర్పాటు చేయాలని మంత్రులకు, ప్రజాప్రతినిధులకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అప్పటి వరకైనా ఆస్పత్రి అధికారులు ఎంసీహెచ్‌లో బాలింతలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



వరండాలోనే బాలింతలు

బౌద్ధస్తూపం వద్ద తవ్వకాలు ప్రారంభం



బౌద్ధస్తూపం వద్ద తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

నేలకొండపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదైన నేలకొండపల్లి బౌద్ధస్తూపం వద్ద పురావస్తు శాఖ ఆధ్వర్యంలో బుధవారం తవ్వకాలు ప్రారంభమయ్యాయి. 1998లో జరిపిన తవ్వకాల్లో బౌద్ధులు నివసించిన ప్రాంతం బయట పడినా.. సంరక్షణకు నాడు నిధులు లేకపోవటంతో వాటిని మట్టితో కప్పేశారు. అయితే ఇక్కడి బౌద్ధ స్తూపం కాలక్రమంగా అభివృద్ధి చెందడం, పర్యాటక ప్రాంతంగా వెలుగులోకి రావడంతో ప్రస్తుత ప్రభుత్వం మరింత అభివృద్ధి చేసేందుకు ఇటీవల రూ.2.50కోట్లను విడుదల చేసింది. అందులో రూ.2 కోట్లు పర్యాటక శాఖకు కేటాయించగా మిగిలిన రూ.50లక్షలను పురావస్తుశాఖకు కేటాయించారు. ఈ నేపథ్యంలో విహారా కాంప్లెక్స్ (బౌద్ధులు నివసించి, ప్రార్థనలు చేసుకున్న ప్రాంతం)ను వెలికి తీసేందుకు తిరిగి తవ్వకాలను ప్రారంభించినట్లు పురావస్తుశాఖ డీడీ నర్సింగ్ తెలిపారు. విహారా కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో బయటకు తీసి సందర్శనా స్థలంగా అభివృద్ధి చేస్తామని, ఇక్కడ బౌద్ధులకు సంబంధించిన ఎన్నో చారిత్రక ఘట్టాలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. త్వరలోనే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెలికితీత పనులను అధికారికంగా ప్రారంభిస్తారన్నారు.

బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలి

» ఎస్పీ రోహిత్ రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

జూలూరుపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. బుధవారం ఆయన జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది నివసిస్తున్న క్వార్టర్స్‌ను పరిశీలించారు. సిబ్బంది వివరాల గురించి ఎస్ఐ బాదావత్ రవిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారితో పోలీస్ సిబ్బంది బాధ్యతగా మెలగాలన్నారు. మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా వ్యక్తులు వాటిని రవాణా చేస్తున్నట్లయితే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. పోలీస్ అధికారుల, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ, ఎస్ఐ బాదావత్ రవి, హెడ్ కానిస్టేబుల్ దయానంద్, సిబ్బంది పాల్గొన్నారు.

23న నెలనెలా వెన్నెల 100వ కార్యక్రమం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న నెల నెలా వెన్నెల, 100వ నెల కార్యక్రమానికి ఈ నెల 23 ఆదివారం, నిర్వహింస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆహ్వానిచటం జరిగిందని నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్య కుమార్ ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగ బత్తిని రవి అన్నారు. 100వ నెల కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు, కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

» సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో 26న దేశవ్యాప్త ప్రదర్శనలు

» అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జుకృష్ణన్

కొణిజర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిలభారత కిసాన్‌సభ జాతీయప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జుకృష్ణన్ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం గ్రామంలో తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో 'కేంద్ర ప్రభుత్వ విధానాలు-వ్యవసాయరంగంలో సంక్షోభం' అంశంపై బుధవారం నిర్వహించిన రైతుసదస్సులో ఆయన మాట్లాడారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం వల్లసాగుకు రైతుల దూరమవుతున్న పరిస్థితినెలకొందన్నారు. కంపెనీలు రైతుల నుంచి రూపాయి.. రెండు రూపాయలకు పంటలు కొని వినియోగదారులకు రూ.వందల్లో విక్రయిస్తూలాభాలు పొందుతున్నాయన్నా రు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న నిర్వహించే దేశవ్యాప్త ప్రదర్శనలు జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని, ఎనిమిది రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి నేడు కేవలం సన్నధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తోందని, అది కూడా వానాకాలంలో పడిన సన్నధాన్యానికి బోనస్ జమచేయలేదన్నారు. తెలంగాణ రైతుసంఘం నేత చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సంగారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్కే మీరా, వాసిరెడ్డి ప్రసాద్, రాయల వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, బొంతు సమత, గుద్దూరి ఉమ, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, మల్లెంపాటి రామారావు, కొప్పుల కృష్ణయ్య, మేడా శరాబంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజ్జుకృష్ణన్

దేశ వ్యాప్తంగా రామారావు సంస్మరణ సభలు

చింతకాని: సామినేని రామారావు హత్య దారుణమైన ఘటన అని దేశవ్యాప్తంగా రామారావు సంస్మరణ సభలు నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు విజ్జు కృష్ణన్ తెలిపారు. మండలంలోని పాతర్లపాడు గ్రామంలో ఇటీవల హత్యకు గురైన సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామారావు భార్య స్వరాజ్యం, ఆయన కుమారుడు విజయ్‌కుమార్‌లతో మాట్లాడి మనోధైర్యాన్నిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ నాయకత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రికు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మూడ్ శోభన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు, మండల కార్యదర్శి రాచబంటి రాము తదితరులు పాల్గొన్నారు.



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజ్జుకృష్ణన్

ఢిల్లీలో భద్రాచలం ఐటీడీఏ స్టాల్

» ఆకట్టుకుంటున్న గిరిజన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాల్

భద్రాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిత్వ శాఖ తరపున జరిగే గిరిజన వ్యాపార సమావేశంలో బుధవారం భద్రాచలం ఐటీడీఏ నుంచి శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లియోబిలిటీ గ్రూపున కు సంబంధించిన మహిళలు వెళ్లి స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌లో విప్పపువ్వు లడ్డూ, విప్ప బర్ఫీ, టీపొడి ఉత్పత్తులకు బహుళ ప్రాచుర్యం తెచ్చేందుకు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. అయితే భద్రాచలం నుంచి ఏర్పాటు చేసిన స్టాల్ విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో ఈ స్టాల్‌ను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జోయల్ ఓరం సందర్శించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన వాటిని చూసి మహిళలను అభినందించారు. భద్రాచలం నుంచి వెళ్లిన స్టాల్ ప్రతినిధులతో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ బుధవారం టెలికాన్ఫరెన్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీసీఆర్‌అండ్‌టీ ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ అధికారి చరణ్, సున్నం సమ్మక్క, సున్నం ఈశ్వరి పాల్గొన్నారు.



హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన స్టాల్

హైదరాబాద్ శిల్పారామంలో

హైదరాబాద్ శిల్పారామంలో జరుగుతున్న భారత్ సమ్మిట్ కార్యక్రమంలో భాగంగా భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎంఎస్ఎం ఈ యూనిట్ గిరిజన మహిళలు, డీఆర్‌డీఏ ఎస్‌హెచ్‌జీ గ్రూప్ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విశేష ఆదరణ లభిస్తోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.

ఘనంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

మధిర రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మధిరలో ప్రభుత్వ పాఠశాలల ఖమ్మం జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మధిరలోని స్థానిక టీవీఎం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో పోటీలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు అండర్-14 విభాగంలో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. పోటీలను మధిర సీఐ మధు ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ పోటీలను పర్యవేక్షించారు. మొదటి బహుమతిని ఖమ్మం నార్త్, రెండవ బహుమతిని ఖమ్మం సౌత్, తృతీయ బహుమతి ఏన్కూరు, బాలికల విభాగంలో ఖమ్మం సౌత్ ప్రథమ, ముదిగొండ రెండవ, మూడవ ఎర్రుపాలెం జట్లు గెలుపొందాయి. నేడు అండర్-17 విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎంఈవో వై ప్రభాకర్, తహసీల్దార్ రాంబాబు, క్రీడల కో- కన్వీనర్ రాజకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్ని పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి సాధించిన ఖమ్మం జట్టు

ఖమ్మం జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అడహక్ కమిటీ ఎన్నిక

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నుంచి నూతనముగా ఉద్యోగొన్నతి పొందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బుధవారం జీహెచ్ఎస్ శాంతినగర్ పాఠశాలలో సమావేశమై తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు యూనియన్ రాష్ట్ర శాఖ ఆదేశం మేరకు ఖమ్మం జిల్లా శాఖ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం నరేందర్ (జీహెచ్ఎం, జడ్పీహెచ్ఎస్ చెరువుమాదారం), వైస్ ప్రెసిడెంట్స్‌గా ఎన్. సుధాకర్‌రావు (జీహెచ్ఎం, జడ్పీహెచ్ఎస్ నామవరం), పి. సుబ్బారావు (జీహెచ్ఎం, జడ్పీహెచ్ఎస్ కల్లూరు), జనరల్ సెక్రటరీగా కే . సొందు (జీహెచ్ఎం, జడ్.పి.హెచ్.ఎస్ అయ్యవారిపేట, సెక్రటరీస్‌గా కే . సాంబమూర్తి జీహెచ్ఎం మల్లెమడుగు, బి. ఉషారాణి జీహెచ్ఎం జడ్పీహెచ్ఎస్ వల్లభి, సీహెచ్ ఉపేందర్ జడ్పీహెచ్ఎస్ భీమవరం, ట్రెజరర్‌లుగా నరసింహారావు జీహెచ్ఎం జడ్పీహెచ్ఎస్ పినపాక, శైలేంద్ర జీహెచ్ఎం చిరుమర్రి, ఉమెన్స్ సెక్రటరీస్ స్రవంతి జీహెచ్ఎం జడ్పీహెచ్ఎస్ పెద వెంకటగిరి, ఎన్‌వీఎన్ వాసవిదేవి జీహెచ్ఎం జడ్పీహెచ్ఎస్ ఏన్కూరులు ఎన్నికయ్యారు.

డీఈవో చైతన్య జైనీని కలిసిన సంఘాలు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నూతనంగా విధుల్లో చేరిన జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీని బుధవారం యూటీఎఫ్, పీఆర్‌టీయూ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.. ఉపాధ్యాయ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరారు. విద్యాభివృద్ధి కృషికి తోడ్పాటున అందిస్తామని తెలిపారు. డీఈవో స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, బుర్రి వెంకన్న, జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్ట శేఖర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావులు పాల్గొన్నారు.

డిసెంబరు13, 14 తేదీల్లో ప్రజానాట్య మండలి జిల్లా మహాసభలు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా 13వ మహాసభలు ఖమ్మం నగరంలో జరగబోతున్నాయని ఈ మహాసభలను కళాకారులు జయప్రదం చేయాలని, ప్రజానాట్య మండలి ఖమ్మం జిల్లా కార్యదర్శి వేముల సదానంద్ కోరారు. బుధవారం నగరంలోని ప్రజానాట్యమండలి కార్యాలయంలో ప్రజానాట్యమండలి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ముందుగా ప్రజాకవి అందెశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదానంద్ మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో తనదైన ముద్రతో పనిచేస్తున్న ప్రజానాట్యమండలి ఆదరించాలని ప్రజా కళలను బ్రతికించాలని దీనికి సరైన రీతిలో ప్రజల మద్దతు పెరగాలని డిసెంబర్లో జరిగే జిల్లా మహాసభలకు పెద్దలంతా సహకరించాలని కోరారు. ఈ జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఏఎస్ కుమార్, జగన్‌మోహన్‌రావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

22న ఏఐబీఈ నమూనా పరీక్ష

ఖమ్మం లీగల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల అర్హత కోసం త్వరలో జరగనున్న అఖిల భారత బార్ ఎగ్జామ్ (ఏఐబీఈ)లో ఉత్తీర్ణులు అవటానికి సాధనలో భాగంగా నమూనా పరీక్షను ఈనెల 22న మానీర్ కాలేజ్ ఆఫ్ లా నందు నిర్వహించబడుతుందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ (ఐఏఎల్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావులు తెలియజేశారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణంలో ఏఐబీఈ మాక్ టెస్ట్ ఎన్రోల్మెంట్ కోసం ఆన్‌లైన్ లింకును వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన వారు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయాలంటే ఏఐబీఈ పరీక్ష ఉత్తీర్ణులవటం తప్పనిసరన్నారు. అందుకోసం ఆల్ ఇండియా బార్ అసోసియేషన్ వారు ప్రతి సంవత్సరంలో రెండుసార్లు ఏఐబీఈ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు ముమ్మడి సతీష్ 9100999344, ఎండీ. పర్వేజ్ 9700683404, రేగళ్ల రాకేష్ 9959913729 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బ(బే)జారులో.. బీఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

అధ్యక్షుడిని నియమించడం లేదన్న అభిప్రాయాలున్నాయి. అయితే తాజాగా కేటీఆర్ సూచనల మేరకు జిల్లా నాయకత్వం పార్టీని పటిష్ఠం చేసే క్రమంలో భాగంగా మండల, పట్టణ అధ్యక్ష పదవులు లాంటివి భర్తీ చేసేందుకు కార్యాచరణ మొదలు పెట్టారు. అయితే దానికి ఆదిలోనే అడ్డంకులు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి.

దుమారం రేపిన అధ్యక్షుల ఎంపిక

పట్టణ, మండలాల అధ్యక్షుల ఎంపిక కూడా తీవ్ర దుమారం రేపింది. ఇల్లెందు పట్టణ అధ్యక్ష పదవికి సంబంధించి రేగా కాంతారావు ఒకరిని నియమించగా.. వెనువెంటనే మాజీ ఎమ్మెల్యే హరిప్రియ పేరుమీద మరొకరిని నియమిస్తున్నట్టు మరో ప్రకటన చేయడం దుమారం రేపింది. దాంతో పాటు చుంచుపల్లి, సుజాతనగర్ మండలాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించారు. అయితే కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న తనను సంప్రదించకుండా, కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఎలా నియమిస్తారంటూ వనమా వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నియోజకవర్గంలోని మిగతా నాయకులు కూడా ఆ నియామకాలను ఖండిస్తూ ప్రకటనలు చేశారు. ఇలా వరుస వర్గ విభేదాలతో పార్టీలో అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయన్న చర్చ జరుగుతోంది.

భద్రాచలానికి బాటసారి లేక?

మిగిలిన నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు నెలకొనగా.. భద్రాచలంలో మాత్రం ఇప్పటివరకు అలాంటి పరిస్థితులు లేవు. అయితే ఈ నియోజకవర్గానికి సంబంధించి ఇన్‌చార్జ్‌ను నియమించకపోవడంతో అక్కడ కేడర్‌ను సమన్వయం చేసుకుని ముందుకెళ్లేవారు లేరన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం అక్కడ కన్వీనర్, కో కన్వీనర్లు మాత్రమే సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. కాగా తాజా పరిణామాల నేపథ్యంలో పార్టీలో అంతర్గత విభేదాలు కాస్త బహిర్గతమవుతుండటంతోక కార్యకర్తల్లో ఆందోళన వ్యక్తమవుతుండగా.. కిందిస్థాయిలో ఎవరి వర్గం వారికి వారే అన్నట్టుగా వ్యవహారశైలి కొనసాగుతోందన్న విమర్శలూ ఉన్నాయి. అంతేకాదు అధ్యక్షుల నియామకాల సమయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ ఏకంగా జిల్లా అధ్యక్షుడిపై విమర్శలకు దిగుతుండటంతో కార్యకర్తల్లో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందన్న ఆందోళన పలువురు నాయకుల్లో వ్యక్తమవుతోంది. మొత్తానికి పార్టీని పటిష్ఠం చేసే సమయంలో అప్రతిష్ట పాలవ్వాల్సిన దుస్థితి నెలకొందన్న ఆవేదనను కొందరు కార్యకర్తలు వెలిబుచ్చుతున్నారు. ఇదిలానే కొనసాగితే రాబోయే రోజుల్లో నిర్వహించే స్థానిక సంస్థలు మొదలు.. మున్సిపల్ కార్పొరేషన్ వరకు ఏ ఎన్నికల్లోనూ ప్రత్యర్థి పార్టీలను దీటుగా ఎదుర్కొనే అవకాశం ఉండదనని శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

అనుమతి లేకుండా లాటరీ పెట్టిన వారిపై కేసు నమోదు

ఖమ్మం క్రైమ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా లాటరీ పెట్టి ఓ ఇంటిని విక్రయించేందుకు ప్రయత్నించిన వారిపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదు అయింది. జయనగర్ కాలనీకి చెందిన కృష్ణవేణి అనే మహిళ తాను ఉంటున్న 130 గజాల ఇంటిని రూ.250 టోకెన్ తీసుకున్న వారికి లాటరీ పద్ధతిలో ఇల్లు రిజిస్ట్రేషన్ చేస్తానంటూ ప్రారంభించింది. నగరానికి చెందిన షేక్ యాసీన్ అను వ్యక్తి లాటరీ పేరుతో మోసగిస్తున్నారని ఫిర్యాదు చేయటంతో కృష్ణవేణి, ఆమే కుమారుడు సాయితో పాటు యలమందల సైదులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

కారేపల్లి నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే ఆందోళన కార్యాక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై.ప్రకాష్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని జమాళ్ళపల్లి ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఆందోళన కార్యక్రమంలో మండలం నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాంబాబు, వెంకన్న, లక్ష్మి, బుజ్జమ్మ, రాంబాయి పాల్గొన్నారు.



జమాళ్ళపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

అనుబంధం ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

అటు వ్యాపారులకు లాభాలు చేకూరనున్నాయి. పలువురికి ఉపాధికూడా లభించనుంది.

చాలీచాలని ధాన్యం మిల్లులు..

సీఎంఆర్ ధాన్యం కోసం మిల్లులు సరిపోవడంలేదు వరంగల్ తదితర జిల్లాలకు ధాన్యం పంపించి మిల్లింగ్ చేస్తున్నారు. ఉమ్మడిజిల్లాలో ప్రస్తుతం ఉన్న రైస్‌మిల్లులతో పాటు అదనంగా మరో 50మిల్లుల వరకు డిమాండ్ ఉంది. ఇటు వానాకాలం, అటువేసవిలోను జిల్లాలో వరి విస్తారంగా పండుతుంది. జిల్లాలో పండుతున్న ధాన్యం పొరుగున ఉన్న ఏపీ, సూర్యాపేట జిల్లాల మిల్లర్లు కొనుగోలు చేసి వెళుతున్నారు. ఇక్కడ మిల్లులు ఏర్పాటైతే స్థానికంగానే రైతులకు గిట్టుబాటుతో పాటు అనేకమందికి ఉపాధి దక్కనుంది. అలాగే పత్తి విత్తనాలు, ధాన్యం, తవుడు నుంచి కూడా నూనే ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. నూనె మిల్లులు ఏర్పాటుచేస్తే కూడా పలువురికి ఉపాధి లభించనుంది. అలాగే జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుంది. మొక్కజొన్న ఆధారిత పరిశ్రమలు దేశ, విదేశాల్లో అనేకం ఉన్నాయి. పొరుగున ఉన్న ఏపీలో కూడా విత్తన ఉత్పత్తి పరిశ్రమలతోపాటు మొక్కజొన్నతో అనేకరకాల ఆహార ఉత్పత్తులు, చేపలు, కోళ్ల, పశువుల మేతలు తయారవుతున్నాయి. మొక్కజొన్న ఆధారిత పరిశ్రమలు పలు జిల్లాల్లో ఏర్పాటవుతున్నా జిల్లాలో మాత్రం ఏర్పాటుకావడంలేదు. అలాగే మొక్కజొన్న , వరి, తవుడు నుంచి బీరు తదితర ఆల్కహాల్‌పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది ఈతరహా పరిశ్రమలు కూడాజిల్లాలో ఏర్పాటు కావడం లేదు.

కలప ఉత్పత్తులూ అధికమే..

అలాగే జిల్లాలో జామాయిల్, సుబాబుల్ లాంటి తోటలుసుమారు ఉమ్మడి జిల్లాలో 3లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. అటవీ భూముల్లో కూడా జామాయిల్ అధికంగా వేస్తున్నారు. ఐటీసీ భద్రాచలం పేపర్‌బోర్డు ఈ కలపను కొని పేపర్ తయారీకి వినియోగిస్తుంది. అలాకాకుండా ప్లైవుడ్‌తో పాటు కలపతో తయారయ్యే అవసరాలకు ఈ కలపను వినియోగించే అవకాశాలున్నాయి. ఈ కలప గుజ్జు దేశ, విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం కూడా ఉంది. వీటి ఆధారిత పరిశ్రమలు జిల్లాలో రావడం లేదు. వ్యవసాయ ఉత్పత్తులు, పండ్ల తోటల ఉత్పత్తులు, కలప ఉత్పత్తులు జిల్లానుంచి భారీగా ఉన్నా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుచేస్తే ఉమ్మడిజిల్లాలలో నిరుద్యోగులకు ఉపాధితో పాటు జిల్లా ఆర్థికాభివృద్ధికి మేలు చేకూర్చనుంది. ప్రస్తుతం ఉన్న సాగునీటి సదుపాయాలతోపాటు సీతారామ లాంటి సాగునీటి ప్రాజెక్టులతో నీటి వనరులు జిల్లాలో పెరుగుతున్నందున వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు అధికార యంత్రాంగం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఖమ్మంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయల కల్పన సంస్థ (టీజీఐఐసీ) ఉన్నా ఈ కార్యాలయంలో అధికారులు ఎవరూ ఉండడంలేదు. నిరుపయోగంగా ఉంటోంది. వాస్తవానికి ఈసంస్థ ద్వారా పరిశ్రమల ఏర్పాటుకకు మౌలిక సదుపాయల కల్పనకు కార్యాచరణ చేయాల్సి ఉంటుంది.

అధికంగా మిర్చి పండుతున్నా.. జాడలేని ఆధారిత పరిశ్రమలు

ఉమ్మడి జిల్లాలో మిర్చి పంట అధికంగానే పండుతుంది. ఇక్కడ మిర్చిని దేశ, విదేశాల కంపెనీలు కొనుగోలు చేసి మిర్చి సాస్, రంగుల తయారీ, నూనెల ఉత్పత్తి, మెడిసిన్ తయారీలో వినియోగం, ఆహార ఉత్పత్తుల్లో వినియోగించే విధంగా మిర్చి ఆధారిత పరిశ్రమలు అనేకం ఏర్పాటు చేసి లాభాలు గడిస్తున్నారు కానీ మిర్చి పండే ప్రాంతంలో ఈపరిశ్రమలు రావడం లేదు. ముదిగొండలో మాత్రమే చైనాకు చెందిన ఓ సంస్థ పరిశ్రమను ఏర్పాటుచేసింది. ఇదే తరహాలో మిర్చి ఆధారిత పరిశ్రమలకు జిల్లాలో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి అవకాశాలు కల్పిస్తే మిర్చి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటవుతాయి. జిల్లాలో మామిడి, జామ, బొప్పాయి లాంటి పంటలు పెద్దఎత్తున పండుతున్నా వీటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కావడం లేదు.

కాంట్రాక్ట్ కార్మికులను కుదిస్తే ఉద్యమం: ఇఫ్టూ

కొత్తగూడెం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యను తగ్గించేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎండి.రాసుద్దీన్, ఎ.వెంకన్న ఆరోపించారు. సింగరేణిలో కొన్ని డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన ఐఎఫ్‌టీయూ ఆఫీస్ బేరర్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ముప్పై సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే కుట్ర జరుగుతుందన్నారు. కొన్ని విభాగాలలో కార్మికులను తగ్గించే ప్రయత్నాన్ని యాజమాన్యం మానుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం ఐఎఫ్‌టీయూ ఉద్యమిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం, రాష్ట్ర సహాయ కార్యదర్శులు జె.సీతారామయ్య, గౌని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు కొండపల్లి శ్రీనివాస్, నెమళ్ల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీవో సారూ.. జర పట్టించుకోండి

ఎస్సీ కాలనీలో బోరు మోటర్ చెడిపోయి రెండేళ్లయిన పట్టించుకోరా

కారేపల్లి నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లి పంచాయతీ పరిధిలోని హరిజనవాడలో బోరు మోటార్ చెడిపోయి రెండేళ్లైన ఇప్పటివరకు ప్రభుత్వ అధికారులు కానీ, పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటుచేసిన బోరు మోటార్‌కు మరమ్మతులు చేస్తే కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రానప్పుడు హరిజనవాడ ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల ఎంపీవో రవీంద్ర ప్రసాద్ సారూ.. మీరైన జర పట్టించుకోని తక్షణమే మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



సు'రక్షిత' ప్రయాణమేదీ..?

» తరచూ ఆర్టీసీ బస్సులకు ప్రమాదాలు

» పెరుగుతున్న బాధితులు

» భద్రాద్రి జిల్లాలో నాలుగు డిపోలకు 263బస్సులు

» ఫిట్నెస్ కానివి 17బస్సులు



అక్టోబరు 10వ తేదీన బూర్గంపాడు వద్ద ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ బస్సులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి.దీంతో ప్రజలు భయం గుప్పిట ప్రయాణాలు సాగిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న బస్సు ప్రమాదాలతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలే అందుకు కారణంగా ప్రయాణికులు భావిస్తున్నారు. అక్టోబరు 2న తేదీన ఆళ్లపల్లి నుంచి కొత్తగూడెం వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. గత నెల పదోతేదీన బూర్గంపాడు ప్రాంతంలో ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న సంఘటనలో 30మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా ఈ నెల 1వ తేదీన జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మహిళ మృతి చెందింది. ఇలా ఆర్టీసీ బస్సు ప్రమాదాలలో తరుచూ సంభవిస్తున్నాయని, ఈ ప్రమాదాల వలన ప్రాణ నష్టం, క్షతగాత్రులుగా ప్రజలు ప్రయాణికులు మిగిలిపోతున్నారని జిల్లాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భద్రాద్రి జిల్లాలో నాలుగు డిపోల్లో 263బస్సులు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు డిపోలు ఉండగా మొత్తం 263బస్సులు నడుస్తున్నాయి. వీటిలో 1,080 ప్రభుత్వ 83 ప్రైవేట్ బస్సులున్నాయి. వీటిలో భద్రాచలం 101(ప్రైవేట్ 22), కొత్తగూడెం 63(ప్రైవేట్ 29), మణుగూరు 71(ప్రైవేట్ 32), ఇల్లెందు 28 (ఏమీ లేవు) జిల్లాలో ఫిట్నెస్ కానీ బస్సులు ఇంకా 17 ఉన్నట్లు రవాణా శాఖ కార్యాలయం సమాచారం.



ఈనెల 1న కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సు..

అరికట్టకపోతే ఆదరణ కరువు..

రోజు రోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టకపోతే ఆర్టీసీకి ఆదరణ కరువవుతుందని వాదన బలంగా వినబడుతుంది. దినదినాభివృద్ధి చెందుతున్న ప్రస్తుత రోజుల్లో ప్రతీఒక్కరూ సురక్షితమైన ప్రయాణాన్ని ఎంచుకునేందుకు ప్రైవేటు, సొంత వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇకనైనా భద్రాద్రి జిల్లా యంత్రాంగం ఆర్టీసీ బస్సుల కండిషన్‌పై, వారు నడిపిస్తున్న సర్వీసులపై, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డ్రైవర్, కండక్టర్, సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆర్టీసీ ఉన్నత అధికారులు, రవాణాశాఖ అధికారులు ప్రమాదరహిత భద్రాద్రి సాధించేందుకు కృషి చేయాలని వాదన బలంగా వినబడుతుంది.

మాస్‌లైన్ నేతలపై కేసులను ఎత్తివేయాలి

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు

ఇల్లెందుటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరిన సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నేతలపై కొమరారం పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికమని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఇల్లెందులో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మొక్కజొన్న పొట్టదశకు రాగానే యూరత కొరత ఏర్పడి దిగుబడి రాక రైతులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న అధికంగా పండించే ఏరియాలోని ఇల్లెందు మండలం, కొమరారం, సుదిమళ్ళ, ముకుందాపురం, రొంపేడు తదితర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో తమ పార్టీ నేతలు, రైతులు ఆందోళనలు చేశారని వివరించారు. ఉద్యమించిన రాష్ట్ర నాయకులు నియనిరాజు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, డివిజన్ అధ్యక్షుడు శ్రీరాంకోటయ్య, గాంధీ, పాష, కొమరారం మాజీ ఎంపీటీసీ బిచ్చాలపై కొమరారం పోలీసులు కేసులు నమోదు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వీరిపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆశ్రయం పొంది, వైద్య సేవల నంతరం కోలుకున్న ఓ మహారాష్ట్ర వాసిని బుధవారం కుటుంబ సభ్యులకు శ్రీనివాసరావు అప్పగించారు. గత సెప్టెంబరు 12న నగరంలోని టూటౌన్ వద్ద ఓ మతి స్థిమితం లేని వ్యక్తిని స్థానికులు గుర్తించి అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. ఆ వ్యక్తికి ఆశ్రయం కల్పించి వైద్యం చేయించగా.. కోలుకున్నాడు. ఆ తర్వాత తన పేరు శివం పాటిల్ అని, మహారాష్ట్ర అని తెలపగా.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి.. బుధవారం అన్నం ఫౌండేషన్ సభ్యులు వారికి అప్పగించారు.

బొగ్గుట్ట.. భవితపై బెంగ



ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయం

- బోధపడని సింగరేణి పుట్టినిల్లు భవితవ్యం
- ఏరియాలో ఏకైక ఓసీ కోయగూడెం
- పూసపల్లి ఓసీ ఏర్పాటుపై నీలినీడలు

ఇల్లెందుటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సింగరేణికి జన్మనిచ్చి.. బొగ్గుగనులకు ఊపిరిపోసి నిలువెల్లా గాయాల వీణగా మారిన బొగ్గుట్ట(ఇల్లెందు) భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 1889నుంచి సింగరేణి కాలరీస్‌లో బొగ్గు ఉత్పత్తులు చేస్తున్న ఇల్లెందు ఏరియాలో సింగరేణి ప్రాభవం కొడిగడుతుందన్న ఆందోళనలో కార్మిక కుటుంబాలు కూరుకుపోయాయి. బొగ్గుట్టలో ఒకనాడు 9,10 వేల మంది కార్మికులతో వేలాదిటన్నుల బొగ్గు ఉత్పత్తులతో కళకళలాడిన ఏరియాలో నేడు కేవలం కోయగూడెం ఓసీ మాత్రమే మిగిలి ఉండడం గమనార్హం. ఏరియా మనుగడ సైతం దినదిన గండంగా మారింది. ఎప్పుడు ఏరియాను మూసివేస్తారో అన్న ఆందోళనలో సింగరేణి కార్మికులు, ఉద్యోగులు కూరుకుపోయారు. ఏరియాలో సింగరేణి మనుగడకే ముప్పు కలుగుతుంది. వివిధ డిపార్టుమెంట్లు, కార్యాలయాలు తరలిపోయే అవకాశం ఉందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఏరియాలో ఉన్న రెండు ఓసీలలో ఇల్లెందు జేకే5ఓసీని ఇటీవలే సింగరేణి యాజమాన్యం మూసివేసింది. బొగ్గు నిల్వలు పూర్తిగా అడుగంటి పోవడంతో ఓసీని మూసివేస్తున్నట్లు యాజమాన్యం గతంలోనే ప్రకటించింది. గత సంవత్సర కాలంగా ఓసీని మూసివేస్తామని అనధికారికంగా ప్రకటించిన యజమాన్యం.. తాజాగా గనిని మూసివేసి ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడంతో నూతన ఓ సీ ఏర్పాటు చేయడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. జేకే5 ఓసీకి అనుసంధానంగానే పూసపల్లి ఓసీ ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు పొందిన యాజమాన్యం స్టేజ్-2 అనుమతుల కోసం ఇప్పటికే ఢిల్లీ స్థాయిలో మంతనాలు చేస్తున్నప్పటికీ.. సంవత్సర కాలంగా పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేయడంలో విఫలం చెందారని కార్మికులు ఆరోపించారు. పూసపల్లి ఓసీకి అనుమతులు నిర్ణీత సమయంలో తీసుకుంటే జేకే5ఓసీలో పని చేస్తున్న కార్మికులను ఇక్కడనే సర్దుబాటు చేసే అవకాశం ఉండేది. కానీ యాజమాన్యం ఈ దిశగా అడుగులు వేయలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతనంగా ఓసీ ఏర్పాటు చేసేందుకు పలు రకాల సవాళ్లను సింగరేణి యజమాన్యం ఎదుర్కొన్నప్పటికీ.. ఓసీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేకపోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నూతన ఓసీ ఏర్పాటు అయ్యేనా!?

ఇల్లెందు ఏరియాలో పూసపల్లి ఓసీపై నీలినిడలు కమ్ముకున్నాయి. ఇల్లెందు సమీపంలోని పూసపెల్లి గ్రామంలో ఆంగ్లేయులకాలంలో మూతపడిన పలు గనులు, పిట్‌లలో నాణ్యమైన బొగ్గు నిక్షేపాలున్నాయని మెగా ఓసి ఏర్పాటు చేస్తే మరో 10ఏళ్ల పాటు సింగరేణి మనుగడ ఇల్లెందు ఏరియాలో సాధ్యమవుతుందన్న విశ్వాసాన్ని కార్మిక కుటుంబాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే పూసపల్లి ఓసీ ఏర్పాటులో భూముల వ్యవహారం సింగరేణి యజమాన్యానికి తీవ్రమైన తలనొప్పిగా పరిణమించింది. కొంతబాగం భూములు రైతుల ఆదీనంలో ఉండటం వారంతా తమకు పరిహారం ఇవ్వాలని సర్వేను అడ్డుకోవడం వంటి చర్యలకు పూనుకోవడంతో పాటు కోర్టులో సైతం తమను నిర్వాసితులుగా గుర్తించాలని పిటిషన్ వేశారు. అంతేకాకుండా సింగరేణి యజమాన్యంకు సైతం బొగ్గు కొనుగోలు దారులు రాకపోవడంతో నూతన ఓసీ ఏర్పాటుపై సుముఖత లేకుండా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

నూతన ఓసీ కోసం తీవ్ర కృషి



జే. వెంకటేశ్వర్లు (ఐఎన్‌టీయూసీ ఏరియా ప్రాతినిధ్య సంఘం నేత)

బొగ్గుగనులకు పుట్టినిల్లు అయిన ఇల్లెందు ఏరియాలో బొగ్గుగనుల పుట్టినింటికి మనుగడ ఉంటుంది. పూసపల్లి ఓసీని త్వరలోనే ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యజమాన్యం కృషి చేస్తుంది. మరో రెండునెలల్లో పూసపల్లి ఓసీ ప్రారంభం అవుతుంది. ప్రస్తుతం కొంతమంది కార్మికులను కేవలం డిప్యూటేషన్‌పై మా త్రమే పంపారు. ఓసీని ఏర్పాటు చేసేవిధంగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సైతం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయంలో కార్మిక కుటుంబాలు ఎవరు కూడా ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

సిరులు కురిపించి.. ఆ పై మూతబడి!

- ఇల్లెందు ఏరియాలో 45 బొగ్గు గనులు మూసివేత
- తాజాగా జేకే 5 ఓసీ సైతం..
- 13 ఏళ్లలో 28మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసిన ఓసీ
- గనుల మూతతో ఆవేదనలో కార్మికులు

ఇల్లెందు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు గనులకు జన్మనిచ్చి.. సింగరేణి పురిటిగడ్డగా పేరొందిన ఇల్లెందులో బొగ్గు గనుల ఉనికి కనుమరుగైంది. ఇల్లెందులో పురుడు పోసుకొని గోదావరి లోయ వ్యాప్తంగా కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి, భూపాలపల్లి, శ్రీరాంపూర్, రామకృష్ణపూర్, మందమర్రి, బెల్లంపల్లి, గోలేటి ఏరియాల వరకు విస్తరించిన సింగరేణి కాలరీస్ చరిత్ర బొగ్గుట్టలో కనుమరుగు కావడం పట్ల సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది. 139 ఏళ్ల సింగరేణి చరిత్రలో నల్ల బంగారానికి జన్మనిచ్చిన ఇల్లెందు ఏరియా స్థానం ఇప్పుడు మినుకు మినుకు మంటోంది. తాజాగా ఇల్లెందులో జేకే 5 ఓసీ మూత పడడం.. పూసపల్లి ఓసీ తవ్వకాలు ప్రారంభం కాకపోవడంతో కార్మికులు ఆందోళనలో కూరుకుపోయారు. 1886లో ఇల్లెందులోనే బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం.. బొగ్గు నిక్షేపాల నిల్వలు పూర్తి కావడం వల్ల ఇల్లెందు ఏరియాలో 45 మైన్స్, పిట్స్ మూసివేతకు గురయ్యాయి. ఇల్లెందులో మూసివేతకు గురైన భూగర్భ గనులను ఓపెన్ కాస్ట్‌గా మారుస్తూ బొగ్గు ఉత్పత్తులు జరుపుతూ వచ్చాయి. క్వీన్ సీమ్‌లో బొగ్గు నిక్షేపాలు ఉండి వెలికితీతకు అనుకూలంగా లేని బొగ్గును ఓసీల ద్వారా వెలికితీసే ప్రక్రియ కూడా ఇల్లెందులోనే ప్రారంభం కావడం గమనార్హం.

ఇల్లెందు ఏరియాలో 1886 నుంచి బొగ్గు తవ్వకాలు చేపట్టగా.. 1889 నుంచి బొగ్గు ఉత్పత్తులు జరపడం.. ఆ తర్వాత బొగ్గు నిల్వలు పూర్తి కావడం మూలంగా ఇప్పటివరకు మొత్తం 45గనులను మూసివేశారు. 1, 2, 3 ఇంక్లైన్‌లు, రోంపేడు 1, 2 మైన్లు, పోలంపల్లి, స్ట్రట్ ఇంక్లైన్, పూర్జాస్ పిట్, ఉస్మాన్ పిట్, బాటమ్ పిట్ జేకే 1, 2, 3, 4, 5 ఇంక్లైన్‌లు, 24 ఇంక్లైన్, 29 డీప్, సెంటినరీ ఇంక్లైన్, పోలంపల్లి ఇంక్లైన్, స్ట్రట్‌పిట్‌తో పాటు తాజాగా మూసివేసిన జేకే 5 ఓసీ తదితర మొత్తం 45 గనులు మూసివేతకు గురైన వాటిలో ఉన్నాయి. బొగ్గు తవ్వకాలలో వేగం పెరగడం.. ఉత్పత్తి లక్ష్యాల్లో పెరగడం.. అధునాతన టెక్నాలజీ వినియోగం వంటి కారణాలతో బొగ్గు నిల్వలు త్వరితగతిన పూర్తయ్యాయి. ఫలితంగా ఇల్లెందు ఏరియాలో సింగరేణి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

జేకే 5 ఓసీ ఎలా ఏర్పడిందంటే..

తాజాగా మూసివేసిన జేకే 5 ఓసీ బొగ్గుగని తన జీవితకాలంలో 28 మిలియన్ టన్నుల నల్లబంగారాన్ని అందించింది. భూగర్భగనులుగా ఉన్న జేకే 1, 2, 3 ఇంక్లైన్‌లతో పాటు 26, 29 డీప్, జేకే 5 భూగర్భ గనుల్లో నిల్వ ఉన్న బొగ్గు వెలికి తీసేందుకు జేకే ఓసీని, ఆ తర్వాత జేకే 5 ఓసీగా ఏర్పాటు చేసి బొగ్గు ఉత్పత్తులు కొనసాగించారు. జేకే ఓసీగా ఏర్పడిన బొగ్గు గని గత 13 సంవత్సరాల కాలంలో 28 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. పైగా ప్రతి ఏటా వంద కోట్ల మేర లాభాలు గడించడం గమనార్హం. అంతేకాక రెండు సార్లు జాతీయ స్థాయిలో 5 స్టార్ అవార్డులను గెలుచుకుంది. అంతేకాక ఉత్తమ ఎకో ఎన్విరాన్‌మెంట్ అవార్డు, సేఫ్టీ అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తూ.. లాభాలు గడిస్తూ జేకే 5 ఓసీ సంచలనాలు సృష్టించింది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏవో బాబురావు

కృషి వాస్ యాప్ ద్వారా రైతులకు మేలు

- భద్రాద్రి జిల్లా వ్యవసాయాధికారి బాబురావు
- దమ్మపేట మండలంలో ప్రయోగాత్మకంగా అమలు

దమ్మపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కృషి వాస్ యాప్ ద్వారా రైతులకు మేలు రైతులకు మేలు జరుగుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయాధికారి బాబురావు అన్నారు. కృషివాస్ యాప్‌పై స్థానిక రైతు వేదికలో బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల ముంగిట్లోకి తెచ్చేందుకు కేంద్రప్రభుత్వ సహకారంతో కృషివాస్ కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈకార్యక్రమాన్ని దమ్మపేట మండలంలో రైతులకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సాగు చేసిన పంటలను జియోట్యాగింగ్ చేసి పంటల్లో వచ్చే తెగుళ్ళను శాటిలైట్ ద్వారా ఏఐ సహకారంతో ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పంటకు కావల్సిన పోషకాలను సకాలంలో గుర్తించి అందించడంతో పాటు, తెగుళ్లకు అధికంగా వెచ్చించే ఖర్చు తగ్గి లాభదాయకంగా ఉండడంతో పాటు అధిక దిగుబడుల సాధించవచ్చునన్నారు.ఈప్రాంతంలో అన్ని రకాల పంటలు సాగుకు అవకాశం ఉండడంతో ఈ కార్యక్రమాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. ఆ తర్వాత కృషి వికాస్ కోఆర్డినేటర్ శ్రీ విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, నర్సింహారెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఏ రవికుమార్, ఎంఏవో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం

భద్రాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి బుధవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనార్చన పుణ్యాహావచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు పరిశీలకుడిగా భట్టు



చుంచుపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పరిశీలకుడిగా జాతీయ మాజీ క్రీడాకారుడు, కొత్తగూడెం వాసి, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు భట్టు ప్రేమ్ కుమార్‌ను ఎంపిక చేస్తూ రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఉషారాణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 14 నుంచి 16 వరకు నల్గొండ జిల్లాలోని నల్గొండ డాన్ బాస్కో పాఠశాలలో జరగనున్న అండర్ -17 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పది జిల్లాల జట్ల నుంచి ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేసే ప్రక్రియలో ప్రేమ్‌కుమార్ ప్రధాన భూమికను పోషించనున్నారు. ప్రస్తుతం చుంచుపల్లి మండలంలోని గౌతంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ప్రేమ్ కుమార్ రాష్ట్ర ఫుట్ బాల్ క్రీడా విభాగంలో చిరపరిచితులు. ప్రేమ్‌కుమార్ నియామకం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మీ, జిల్లా యువజన క్రీడల అధికారి పరందామరెడ్డి, జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

డిసెంబరు నాటికి మార్కెట్ పునర్నిర్మాణం పూర్తవ్వాలి

- మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మీబాయి
- సీసీఐ కొనుగోలు కేంద్రాల సందర్శన

ఖమ్మం మార్కెట్/ఖమ్మం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ పునర్నిర్మాణ పనులను డిసెంబరు నాటికి పూర్తిచేయాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మీబాయి అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఆమె యార్డుల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం యార్డులకు సంబంధించి అధునాతన షెడ్ల నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అంతకు ముందు ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, పొన్నెకల్లులో ఉన్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. క్రయ, విక్రయాల్లో ఎదురవుతున్న సమస్యల గురించి చర్చించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట అమ్ముకోవడానికి వచ్చిన పలువురు రైతులతో ఆమె మాట్లాడారు. కిసాన్ కపాస్ యాప్‌లో రైతులు ముందుగానే పంట అమ్ముకునే తేదీని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పత్తి రైతులకు సూచించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. కేంద్రానికి పత్తి తీసుకువచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మార్కెటింగ్ అదికారులపైనే ఉంటుందన్నారు. పత్తి కాంటాలు అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని, బయ్యర్లను ఆదేశించారు. ఆమె వెంట రాష్ట్ర మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, డీఎంవో అలీం, మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, ఏఎస్ వీరాంజనేయులు, తదితరులు ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న లక్ష్మీబాయి

తెలంగాణ శబరిమలగా భద్రాద్రి హరిహర క్షేత్రం



భద్రాచలంలోని హరిహర క్షేత్రం




అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

- 2022 నుంచి అధిక సంఖ్యలో తరలొస్తున్న అయ్యప్పస్వాములు
- 16 నుంచి భద్రాద్రిలో మండల దీక్షల ప్రారంభ సందడి

భద్రాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ రామ క్షేత్రంగా భాసిల్లుతున్న భద్రాచలంకు ఇటీవల కాలంలో అయ్యప్పస్వాములు దీక్ష విరమణకు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. దీంతో భద్రాద్రి హరిహర క్షేత్రం తెలంగాణ శబరిమలగా అభివృద్ధి చెందుతోంది. స్థానిక గోదావరి నదీ తీరంలోని హరిహరక్షేత్రంకు భక్తులు తరలివస్తూ తమ మొక్కులను తీర్చుకుంటున్నారు. 2022 కరోనా అనంతరం వరంగల్, కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి తమ ఇరుముడులను స్థానిక అయ్యప్పస్వామి సన్నిధిలో సమర్పిస్తున్నారు. ఈక్రమంలో భద్రాద్రి హరిహరక్షేత్రంలో మండల పూజల సందడి 16 నుంచి ప్రారంభం కానుంది. డిసెంబరు 27న సైతం మండల పూజ నిర్వహించనుండగా మరక జ్యోతి జనవరి 14న సాయంత్రం నిర్వహించనున్నారు. కేరళలోని శబరిమలై, ఏపీలోని ద్వారపూడిలతో పాటు భద్రాచలంలోని అయ్యప్ప ఆలయం దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతోంది.

నాలుగున్నర దశాబ్దాలుగా అయ్యప్ప దీక్షధారణ



శివన్ గురుస్వామి

శివన్ గురుస్వామి తొలిసారిగా భద్రాచలంలో అయ్యప్ప దీక్షలకు శ్రీకారం చుట్టారు. నాడు తన ఆధ్యాత్మిక ప్రవచనాలతో శిష్యగణాన్ని సైతం మాలధారణ చేపట్టేలా ప్రోత్సహించారు. ఈ క్రమంలో 1989లో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. 1996లో శివన్ గురుస్వామి నిర్మించిన అయ్యప్ప ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. నాటి నుంచి ఆలయం దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతోంది. ఈ ఆలయ ప్రాంగణంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, నవగ్రహాల ఆలయం, మాలికపురోత్తమ్మ అమ్మవారి ఆలయాన్ని సైతం నిర్మించి నిత్యం కేరళ నుంచి వచ్చిన అరుణ్ రామచంద్రన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శివన్ గురుస్వామితో ప్రారంభమైన అయ్యప్ప స్వామి మాలదారణ కార్యక్రమం నేడు ఐదువేల మందికి పైగా అయ్యప్ప భక్తులు స్వీకరిస్తుండటం విశేషం.

18 మెట్ల పూజ ఇక్కడి ప్రత్యేకత

హరిహర క్షేత్రంలో అయ్యప్పస్వామి సన్నిధిలో ప్రతి ఏటా 18 మెట్ల పడిపూజ(పదునెట్టాంబడి)ను ఎంతో భక్తి ప్రపత్తులతో సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తుంటారు. ఈ 18 మెట్ల పడిపూజ వల్లే భద్రాచలం హరిహరక్షేత్రం తెలంగాణ శబరిమలగా వెలుగొందుతోంది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీగా భక్తులు తరలివస్తుండడం చెప్పుకోదగ్గ విషయం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సాధారణ రోజుల్లో సుమారు 500 మందికి అన్నదానం చేస్తుండగా ప్రత్యేక పర్వదిన సమయాల్లో ఈ సంఖ్య మూడువేల వరకు చేరుకుంటుండటం జరుగుతోంది. శివన్ గురుస్వామి శిష్యులు,దాతల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ గత కొన్నేళ్లుగా నిర్వహిస్తుండడం జరుగుతోంది.

పశువుకు వైద్యం చేస్తూ కుప్పకూలాడు..

గుండెపోటుతో వెటర్నరీ అసిస్టెంట్ మృతి



మృతి చెందిన నరేందర్

కూసుమంచి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ అసిస్టెంట్ ఒకరు పశువుకు వైద్యం చేస్తూనే కుప్పకూలి మరణించిన సంఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం తాళ్లగడ్డతండాలో బుధవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలివీ.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన మాడుగుల నరేందర్ (48) కూసుమంచి మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని రాజుపేటబజార్ పంచాయతీ శివారు తాళ్లగడ్డతండాకు చెందిన ఓ రైతు ఈనేందుకు సిద్ధంగా ఉన్న తన పశువుకు వైద్యం చేసేందుకు రావాలంటూ ఫోన్‌చేశాడు. స్పందించిన నరేందర్ వెంటనే తాళ్లగడ్డతండాకు వెళ్లి పశువుకు వైద్యం చేస్తుండగా గుండెపోటు వచ్చి అక్కడికక్కడే కుప్పకూలాడు. దాంతో స్థానికులు ఆయనకు సపర్యలు చేసి.. ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కుప్పకూలిన వెంటనే ఆయన మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటన అటు గ్రామంలోనూ.. ఇటు పశువైద్యశాఖ ఉద్యోగుల్లోనూ తీవ్ర విషాదాన్ని నింపింది.

బాధితులకు 30 మొబైల్ ఫోన్ల అప్పగింత

- ఖమ్మం అడిషనల్ డీసీపీ రామానుజం వెల్లడి

ఖమ్మం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పోగొట్టుకున్న 30 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ (సీఈఐఆర్) ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు ఖమ్మం అడిషనల్ డీసీపీ బి. రామానుజం తెలిపారు. బుధవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ల బాధితులకు ఆయన సెల్‌ఫోన్లు అందజేశారు. అనంతరం అడిషనల్ డీసీపీ విలేకరులతో మాట్లాడుతూ.. సీఈ ఐఆర్ పోర్టల్ విధానంతో సుమారు రూ. 8 లక్షల విలువ గల 30 ఫోన్లను ట్రేస్ చేసి, నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఒక్కొక్క మొబైల్ ఫోన్ విలువ రూ. 10వేల 50వేల వరకు విలువ ఉంటుందన్నారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే 7998 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోర్టల్‌లో ఫిర్యాదులు నమోదు కాగా.. 2938 ఫోన్లను గుర్తించి మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించిన ఐటీ సెల్ ఇన్‌చార్జ్ హేమనాథ్, టెక్నికల్ బృందాన్ని ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ డీసీపీ రామానుజం ప్రత్యేకంగా అభినందించారు.

బదిలీ వర్కర్లకు జనరల్ అసిస్టెంట్ ట్రైనీలుగా
క్రమబద్ధీకరణకు యాజమాన్యం అంగీకారం

గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్



రాజ్‌కుమార్

కొత్తగూడెం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల్లో బదిలీ వర్కర్ అనే డిసిగ్నేషన్‌ను తొలగించి జనరల్ అసిస్టెంట్ ట్రైనీ డిసిగ్నేషన్‌ను క్రమబద్ధీకరించేందుకు కృషి చేస్తున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. సింగరేణి వ్యాప్తంగా 2004 సంవత్సరంలో అండర్‌గ్రౌండ్‌లో 190, సివిల్ విభాగంలో 240 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లందరినీ జనరల్ అసిస్టెంట్ ట్రైనీగా క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రకటించారు. సింగరేణి వ్యాప్తంగా 1258 మందికి త్వరలోనే ప్రయోజనం చేకూరుతుందన్నారు. భూపాలపల్లి ఏరియాలో 252, శ్రీరాంపూర్ ఏరియా 236, రామగుండం - 2 ఏరియాలో 299, రామగుండం- 3 ఏరియాలో 167, రామగుండం -1 ఏరియాలో 162, మందమర్రి ఏరియాలో 68, కొత్తగూడెంలో 21, మణుగూరు 18, బెల్లంపల్లి 11, ఇల్లెందు 6, మందమర్రి 65 కొత్తగూడెం కార్పోరేట్ 21 మందిని క్రమబద్ధీకరించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి చైర్మన్ బలరాంతో జరిపిన స్ట్రక్చర్ సమావేశంలో అంగీకరించినట్లు రాజ్‌కుమార్ తెలిపారు.



పట్టణంలో మట్టి లోడ్‌తో ప్రమాదకరంగా వెళుతున్న టిప్పర్

సత్తుపల్లిలో ఆగని మట్టి రవాణా

సత్తుపల్లిరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో జోరుగా మట్టి రవాణా జరుగుతోంది. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా.. నిత్యం పదుల సంఖ్యలో మట్టి టిప్పర్ వందల ట్రిప్పులు వేస్తున్నప్పటికీ.. ఒక్కటంటే ఒక్కటే టిప్పర్ లారీని మైనింగ్ శాఖాధికారులు ఇటీవల దాడులు జరిపి స్వాధీనం చేసుకున్నారు. సత్తుపల్లి పట్టణ, మండల వ్యాప్తంగా రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్ లారీ తిరుగుతూ.. వందలాది ట్రిప్పుల మట్టి తోలకాలను సాగిస్తున్నాయి. ఇదంతా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికీ.. తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులోని సత్తుపల్లి వంటి రద్దీ ప్రాంతాలో ఇప్పటికే వాహనాల రాకపోకలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ మట్టి టిప్పర్ల మితీమీరిన వేగంతో పాటు టాప్‌పై ఎలాంటి రక్షణ లేకుండా పరదాలు కప్పకుండా వెళ్తుండటంతో వాహనదారులు, చుట్టుపక్కల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణను వివరణ కోరగా.. మైనింగ్ శాఖకు సమాచారం ఇవ్వాలని సమాధానం దాటవేశారు. మైనింగ్ శాఖ ఏడీ సంజయ్‌ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా.. తాను సెలవులో ఉన్నానని, తన కిందిస్థాయి అధికారికి సమాచారం ఇవ్వాలని చెప్పి ఆయన కూడా పక్కకు తప్పుకున్నారు. ఈ విషయంలో ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి అక్రమ మట్టి రవాణాకు అడ్డు కట్ట వేయాల్సిన అవసరం ఉంది.

సమయ పాలన, క్రమశిక్షణ ఉన్నతికి సోపానం

ఖమ్మం రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సమయపాలన, క్రమశిక్షణ వారి ఉన్నతికి సోపానాలని, పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు విద్యారంగానికి చేస్తున్న సేవలు అభినందనీయమని వెంకటగిరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని దొడ్డా స్రవంతి అన్నారు. వెంకటగిరి ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం పరిశ సీతారత్నం చారిట్రబుల్ ట్రస్ట్ 30 కుర్చీలను ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య బుధవారం అందజేశారు. కుంచకూరి సతీష్, ఝాన్సీ కుమారి పెళ్లి రోజు సందర్భంగా ఉపకరించేలా కుర్చీలు అందజేసినట్లు ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య తెలిపా రు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కోట్యా, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీదేవి, ఉపాధ్యాయులు సువర్ణప్రసాద్, వీరబాబు, రమణ, రమేష్, కృష్ణకుమారి, రవికిషోర్, రమాదేవి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో పాల్గొన్న పెన్షనర్లు

ఖమ్మం అర్బన్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రైటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలేనిరహారదీక్షలు బుధవారం రెండవరోజు కొనసాగాయి. పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీచంద్ మాట్లాడుతూ 2024 మార్చి నుంచి రిటైర్డ్ అయిన వారి పెన్షన్ బకాయిలు, గ్రాట్యుటీ, కమ్యూనికేషన్ ఎన్‌క్యాష్ మెంట్, జీపీఎఫ్, జీఐఎస్ వెంటనే చెల్లించాలన్నారు. రిటైర్డ్ బెనిఫిట్స్ రాక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రిలే నిరహార దీక్షలో ఆర్ లక్ష్మణరావు, కృష్ణారావు, బాబురావు, రామకోటేశ్వరరావు, భాస్కర్‌రావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు. పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్‌లు శ్రీ విద్య, సాయి గీతికలు అన్నారు. మండల పరిధిలోని పోన్నేకల్లు పరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 54 మంది విద్యార్థులు చైన్నైలోని స్కీనేడర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.జె.లక్ష్మీ నారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కీనేడర్ సంస్థ హెచ్.ఆర్. శ్రీకాంత్, అకాడమిక్ డీన్ డా.వి.సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కృష్ణప్రసాద్, ప్రణతి, జ్యోతి, చార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మం అర్బన్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సబ్ స్టేషన్ల మరమ్మతులు, చెట్లు కొట్టే కార్యక్రమం దృష్ట్యా గురువారం ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మోతీనగర్ ఫీడర్ పరిధిలోని దోబీవాడ, పీఎస్ఆర్ రోడ్, వీరాంజనేయస్వామి టెంపుల్‌రోడ్డు, మోతీనగర్, వాసవీ గార్డెన్, పీసీకే తోట, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్, గాంధీనగర్, కొత్తసీతారాములు లైన్, పాతచేపల మార్కెట్, ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలి



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఖమ్మం అర్బన్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతలు నియంత్రణలో ఉన్నాయని ప్రగల్భాలు పలికిన అమిత్ షా ఇంతటి ఘోరాలకు ఏం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర నాయకులు పోటు పూర్ణచంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, గోపీ, ఉపేందర్, చరణ్, సాయి, ప్రణయ్ సలీం, ఇస్మాయిల్ , అబిద్, సుమంత్, జాఫర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

17న విద్యార్థులకు ఆటల పోటీలు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో చలపతిరావు

నేలకొండపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే బాలల దినోత్సవ వేడుకలు నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వాసవీభవన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నృత్యం, డిబేట్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల విద్యాధికారి బాలిన చలపతిరావు మాట్లాడారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గెల్లా వెంకటరమణగుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి మాజీ అధ్యక్షులు యలమద్ది లెనిన్, వెల్లంపల్లి శ్రీనివాస్, పాలడుగు పూర్ణచంద్రప్రసాద్, గెల్లా జగన్మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు భవనాశి దుర్గారావు, పచ్చా తిరుపతయ్య, కోడూరి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి రవాణా

- ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమి నుంచి తోలకాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అక్రమంగా గుట్టను తొలగిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఎటువంటి సెస్సును చెల్లించకుండా, పగలు, రాత్రి తేడా లేకుండా, ప్రభుత్వ భూమినుంచి వేలకొద్ది ట్రిప్పుల మట్టిని, ఎటువంటి అనుమతులు లేకుండా, అక్రమంగా తోలుకుంటున్నా అధికారులు కళ్ళప్పగిచ్చి చూడటంతప్ప ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తున్నది. ప్రభుత్వ సంపదను కాపాడాల్సిన అధికారులతో పాటుగా రాజకీయ నాయకుల వత్తాసుతో ఓకాంట్రాక్టరు రోడ్డు నిర్మాణం పేరుతో ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 53లో ఉన్న గుట్టలను కరుగదీసి వేలకొద్దీ ట్రిప్పుల మట్టిని రోడ్డుకు తోలుకున్న సంఘటన నేలకొండపల్లిలో జరిగింది.

మండల పరిధిలోని మంగ్రాజుపల్లి నుంచి కోరట్లగూడెం వరకు రూ.220లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి 2025జూలై30న మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. కాగా ఇటీవల కాంట్రాక్టర్ రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డుకు అవసరమైన మట్టిని తోలటానికి మంగ్రాజుపల్లి రెవెన్యూలోని సర్వే నెంబరు 53లో ఉన్న భూమిని ఎంచుకుని, అక్కడి నుంచి దర్జాగా మట్టిని రోడ్డుకు డంపర్ల ద్వారా తోలుకుంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ మట్టిని తోలుకోవటానికి సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించలేదని సమాచారం.

పట్టించుకోని అధికారులు...

దాదాపుగా నెల రోజులుగా ఇష్టానురీతిన మట్టిని, అదీ ప్రభుత్వ భూమి నుంచి అక్రమంగా తోలుతున్నప్పటికీ సంబంధిత మండల అధికారులకు మాత్రం కనపడక పోవటం ఆశ్చర్యంగా ఉంది. నిత్యం రోడ్డుపై నుంచి డంపర్లు మట్టితో, ఓవర్ లోడ్‌తో వెళుతున్నప్పటికీ, జీపీఓ, ఆర్ఐ తదితర రెవెన్యూ అధికారులు తిరుగుతున్నప్పటికీ డంపర్లు కనపడలేదా అని స్థానికులు ఆరోపిస్తున్నారు. రూ.లక్షల విలువైన మట్టి అక్రమంగా తరలుతున్నప్పటికీ, నిత్యం గ్రామాల్లో ఏదో ఒక పనిపై తిరిగే అధికారులకు కనపడక పోవటం పలు అనుమానాలకు తావిస్తున్నది. అక్రమ మట్టి తోలకాలపై ఫిర్యాదులందినా అధికారులు స్పందించకపోవటం విడ్డూరంగా ఉందని పేర్కొంటున్నారు.

రాజకీయ నాయకుల అండ...

కాంట్రాక్టర్లకు అధికారులతో పాటుగా రాజకీయ నాయకుల అండ పుష్కలంగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల అండతో కాంట్రాక్టర్లు రెచ్చిపోతున్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఆర్థిక లావాదేవీలతోనే అధికారులు పట్టించుకోవడం లేదని, నాయకులు సైతం అడ్డం పడుతున్నారనే ప్రచారమూ ఉంది. ఏమైనప్పటికీ ఎటువంటి అనుమతులు లేకుండా, ఎటువంటి పన్నులు చెల్లించకుండా, అధికారులు, రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకుని అడ్డగోలుగా రెచ్చిపోతున్న కాంట్రాక్టర్లను అదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే సమయంలో ప్రభు త్వ ఖజానాకు ఆదాయం సమకూర్చేలా చర్యలు చేపట్టాల్సిన అవసరము ఉందని స్థానికులు కోరుతున్నారు.

ఎన్‌వోసీ లేదు... తహసీల్దార్ వెంకటేశ్వర్లు

అక్రమంగా మట్టిని తోలుతున్న విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి, ఏమైనా అనుమతులిచ్చారా? అని ప్రశ్నించగా ఎటువంటి అనుమతులూలేవని స్పష్టం చేశారు. ఎన్‌వోసి ఇవ్వలేదన్నారు.(అప్పటికే రోడ్డుకు అవసరమైన మట్టిని కాంట్రాక్టర్ తోలుకున్నాడు). అక్రమంగా మట్టిని తోలుతున్న విషయం తన దృష్టికి రాగానే మట్టి తోలకాలను నిలిపి వేయించానన్నారు. అక్రమంగా మట్టిని తరలించిన దానికి ఏమైనా నోటీసులిచ్చారా?అని అడగ్గా ఎటువంటి సమాధానం చెప్పలేదు.

నేడు తిరుమలాయపాలెంలో మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మండలంలో పర్యటించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలాయపాలెంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించినున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయాగ్రామల్లో సభల్లో ప్రసంగిస్తారన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



కూసుమంచి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూసుమంచి లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుదవారం హుండి లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. హుండి ఆదాయం రూ.1 లక్షా,90 వైల ఆధాయం వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

అత్యంత సేఫ్టీగా హుండయ్ వెన్యూ

- భారతీయ రహదారులకు అనువైన కారు
- న్యూ వెన్యూను ప్రారంభించిన డీటీవో జగదీష్



వెన్యూ వాహనాన్ని ప్రారంభిస్తున్న డీటీవో జగదీష్

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భారతీయ రహదారులకు అనువైన కారుగా మంచి గుర్తింపు పొందిన హుండయ్ వెన్యూ ఇప్పుడు మరింత సేఫ్టి ఫీచర్లుతో అందుబాటులోకి వచ్చిందని, ఆధునిక సాంకేతికతను జోడించి లగ్జరీ కార్ల ఫీచర్లతో తయారు చేయటం మంచి పరిణామంగా ఉందని జిల్లా రవాణాశాఖ అధికారి ధర్మపురి జగదీష్ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం భారత్ హుండయ్ షోరూమ్‌లో నూతన వెన్యూ వాహనాన్ని, భారత్ గ్రూప్ ఆప్ కంపెనీస్ ఎండీ సుభాష్ చంద్రబోస్‌తో కలిసి డీటీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ లగ్జరీ కార్లు వలే డ్రైవర్ పాసింజర్ సీట్లుకు వెంటిలేటెడ్ సీట్లు, 4వే ఎలక్ట్రీకల్ డ్రైవర్ హైట్ సీటు, 12.3 టచ్ స్కీన్, డిజిటల్ క్లస్టర్, 360కెమెరా, 4వీల్ డిస్క్ బ్రేక్స్, ఎలక్ట్రిక్ పార్కింగ్, బ్రేక్ విత్ ఆటో హోల్డ్, 375 లీటర్ల బూట్ స్పేస్‌తో అందుబాటులో రావటంతో అన్ని వర్గాల ప్రజల్ని వెన్యూ ఆకట్టుకుంటుందని కుటుంబ కారుగా గుర్తింపు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మెనేజరు రాజశేఖర్, హుండయ్ జనరల్ మెనేజరు కృష్ణ, సేల్స్ మెనేజర్లు, ఉద్యోగులు, కస్టమర్లు, ఫైనాన్సియర్స్ పాల్గొన్నారు.

ఘనంగా పాథాలజీ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పాథాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం మెడికల్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శంకర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ప్రతి అంశంలోనూ నిశితమైన పరిశీలన ఉండాలని దీనికోసం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. వైద్యరంగంలో పాథాలజీ విభాగం అనేది కీలకమన్నారు. అనంతరం పాథాలజీ విభాగం హెచ్‌వోడీలు, అసోసియేట్ ప్రొఫెసర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, డాక్టర్ సృజన, డాక్టర్ బి. కిరణ్‌కుమార్, డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీపీఐ సానుభూతి పరుల మృతి

ఖమ్మం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో 28వ డివిజన్‌కు చెందిన గువ్వల కృష్ణ(63) అనారోగ్యం తో బుధవారం మృతి చెందాడు. అదేవిధంగా మండల పరిధిలోని గుండాల తండాకు చెందిన భూక్యా మారు(65) అనారోగ్యంతో మృతి చెందింది. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్‌లు వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సురేందర్, రంగారావు, రాము తదితరులున్నారు.

గ్రానైట్ మార్కర్‌యూనియన్ ఆధ్వర్యంలో వనభోజనాలు

ఖమ్మం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్తీక మాసం వనభోజనాల కార్యక్రమాన్ని ఈ నెల 17న సోమవారం నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకుడు జానీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు నుంచి తెల్దారుపల్లి గ్రామ వెల్లే దారిలోని మామిడితోటలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిదంగా అదే రోజు ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ నూతన పాలకవర్గాన్ని కూడా ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా వీరన్న



తిరుమలాయపాలెం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కన్వీనర్‌గా వశపొంగు వీరన్న రెండోసారి ఎన్నికయ్యా రు. బుధవారం తిరుమలాయపాలెంలో 27మందితో సీఐటీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికరంగ సమస్యలపై ని రంరతం పోరాడతానని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నగేష్

తిరుమలాయపాలెం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లి, పాతర్లపాడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సులభతరంగా విక్రయించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం సంపత్‌కుమార్, ఆర్ఐ పవన్, కాంగ్రెస్ నాయకులు పోట్ల కిరణ్, వెంకటరెడ్డి, జడల రమేష్, దడిదల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విత్తన కంపెనీ అగ్రిమెంట్ తీసుకోవాలి



మొక్కజొన్న రైతులకు అవగాహన కలిగిస్తున్న వ్యవసాయాధికారులు

ఖమ్మం అర్బన్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన కంపెనీ ప్రతినిధుల నుంచి అగ్రిమెంటు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కొంగర వెంకటేశ్వర రావు రైతులకు సూచించారు. మొక్కజొన్న రైతుల అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఉమామహేశ్వర్‌రెడ్డి, విస్తరణాధికారులు శిరణ్మయి, వేదవ్యాసన్, ప్రతిభ, శ్రీకాంత్, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన రక్షిత



నేలకొండపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇటీవల సదిశ ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిభా పరీక్షలో నేలకొండపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.రక్షిత అత్యధిక మార్కులను సాధించి ఇంటర్మీడియెట్‌లో ఉచిత సీటును సాధించింది. 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్‌లో ఉచిత విద్యను పొందింది. ఈ సందర్భంగా రక్షితను పలువురు అభినందించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి పొంగులేటి

- జర్పుల సింధుకు సీఎం రిలీఫ్ చెక్కు అందజేత



సింధు కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలంలోని ధర్మాతండాకు చెందిన జర్పుల సింధు అనారోగ్యంతో బాధపడుతుండగా గతంలో మంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక చొరవ తీసుకుని రూ.1.75 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం అందజేశారు.

ఈ సందర్భంగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సహాయం అందించినందుకు మంత్రికి కు టుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మంగలితండాకు చెందిన బానోత్ మంగ్యా నాయక్, ధర్మతండాకు చెందిన ధరావత్ రామోజీ నాయక్, చేగొమ్మ గ్రామానికి చెందిన బొలికొండ శ్రీనివాస్ తల్లి, చిర్రా పెద్ద వెంకన్న మరణించడంతో వారికుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంగళితండాలో విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ప్రజల కష్టసుఖాల్లో తాను ఎప్పుడూ అం డగా ఉంటానని బాధిత కుటుంబాలకు ప్ర భుత్వం ఎల్లప్పుడూ తోడుంటుందని తెలిపారు.

న్యూఇరా పాఠశాలకు సీబీఎస్ఈ అధికారిక గుర్తింపు



కేక్ కట్ చేస్తున్న పాఠశాల చైర్మన్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ కరుక్యులమ్ ఎంతో పారదర్శకంగా, నిబద్ధతతో సాగిస్తున్న న్యూఇరా పాఠశాలకు 11వ, 12వ తరగతికి అధికారికంగా సీబీఎస్ఈ నుంచి గుర్తింపు లభించిందని పాఠశాల చైర్మన్ ఐవీ.రమణారావు, డైరక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది పాఠశాల చరిత్రలో ఒక మైలురాయని, విద్యారంగంలో ఒక గొప్ప విజయాన్ని సూచిస్తుంది అని అన్నారు. ఈసందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

16న కమ్మ మహాజన సంఘం వనసమారాధన

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో నవంబరు 16న జరగబోయే కార్తీక మాస వనసమారాధన ఈసారి వైభవంగా నిర్వహిస్తున్నామని సంఘ అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాములు అన్నారు. బుధవారం చేరుకూరి మామిడి తోటలో నిర్వహించిన సమావేశంలో పలువురు సంఘం నాయకలు హాజరై వివరాలు వెల్లడించారు. వనసమారాధన ప్రధాన లక్ష్యం సమాజంలో బంధుత్వం, ఏకతా భావం, పరస్పర అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమం మన సమాజ ఐక్యతకు ప్రతీక అన్నారు.

ఈ మహోత్సవానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మేయర్ పునుకుల్ల నీరజ, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నున్నా మాధవరావు, మందడపు సుధాకర్, వనమా వాసు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, మందడపు రామకృష్ణ, కొత్తపల్లి నీరజ, వై వి, బత్తిని నాగప్రసాద్, బాబ్జీ, కేతినేని హరీష్, కొల్లి వెంకటేశ్వరరావు, గరికపాటి వెంకట్రావు, రావూరి సైదుబాబు, దిరిశాల వెంకటేశ్వరరావు, వల్లభనేని రామారావు, నున్నా నవీన్, పోటు శరత్, కమ్మ మహాజన సంఘం సంఘం వైస్ ప్రెసిడెంట్ కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలాకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి, నంబూరి సత్యనారాయణప్రసాద్, డాక్టర్ పోతినేని భూమేశ్వర్ రావు, నల్లమల ఆనంద్, కోలేటి నవీన్, తాళ్ళూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమ్మ సంఘం నాయకులు

జేవీఆర్ ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు పదోన్నతి

సత్తుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ వెల్ఫేర్ ఆఫీసర్ దేవదాస్ పదోన్నతిపై బదిలీ అయ్యారు. కొత్తగూడెం సింగరేణి సూపర్‌మార్కెట్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన దేవదాస్‌ను బుధవారం స్థానిక జేవీఆర్ ఓసీ పీవో కార్యాలయంలో ఉద్యోగులు, కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అన్ని విభాగాల అధికారులను సంఘటితం చేసి ఓసీ అభివృద్ధిలో ఉద్యోగుల సంక్షేమం కోసం ఎనలేని కృషి జరిపారని, ఇలాంటి అధికారులను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఉద్యోగులు కొనియాడారు. కార్యక్రమంలో ఓసీ ఉద్యోగులతో పాటు ఎస్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ జమేదార్, సీనియర్ సెక్యూరిటీ గార్డ్స్, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ పాల్గొన్నారు.

మక్క సాగుకు అన్నదాతలు సిద్ధం..

పత్తి పొలాలను దున్నిస్తున్న రైతులు

పత్తి నష్టాల నుంచి గట్టెక్కిస్తుందన్న ఆశాభావం!

బోనకల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పత్తి నుంచి మక్కల సాగు వైపుకు రైతులు దృష్టిసారించారు. మండలంలో పత్తి పొలాలను దున్నించి మక్క సాగుకు ముందస్తుగా సిద్ధం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి విత్తనాలు వేసేందుకు వేచి చూస్తున్నారు. ఇప్పటివరకు వరుస తుపానుల వలన భూముల్లో తేమ తీవ్రత అధికంగా ఉంది. వర్షాలు లేకుండా పోతే వెంటనే మక్క పంట వేసేందుకు గానూ దుక్కులు దున్నించి, విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉన్నారు. వానాకాలం పంటగా సాగు చేసిన పత్తి రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. పంట చేతికందే తరుణంలో వరుస తుపానులు రైతులను కోలుకోని విధంగా దెబ్బతీశాయి. ఎకరానికి 5 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదని ఎక్కువ మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంట కూడా వర్షాలకు తడవడంతో పత్తి రంగు మారింది. దీంతో పత్తిని ఇళ్లల్లోనే ఆరదీస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లకు సవాలక్ష నిబంధనలు రైతులకు శాపంగా మారాయి. దీంతో ఎక్కువమంది రైతులు తమ పంటను ఇళ్ల వద్దనే అమ్ముకోవాలని చూస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో ప్రైవేటు వ్యాపారులు కూడా పత్తి కొనుగోళ్లకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని, తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. పత్తి సాగులో చవిచూసిన నష్టాల నుంచి గట్టెక్కే దారి తమకు మక్క సాగుతో మాత్రమేనని రైతులు ఎంతగానో ఆశలు పెట్టుకున్నారు. గతేడాది మక్కల సాగు రైతులకు లాభదాయకంగా ఉండటంతో ప్రస్తుత సీజన్లో కూడా అదే సాగు కలిసి వస్తుందన్న ఆశాభావంతో అన్నదాతలు ముందుకు సాగుతున్నారు.



మక్క సాగుకు దుక్కులు చేస్తున్న రైతులు

వ్యాసరచన పోటీల్లో మౌనశ్రీ ప్రతిభ



మౌనశ్రీని అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఏన్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన పోటీల్లో ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనశ్రీ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచింది. ఖమ్మంలో మంగళవారం టీ షాట్, టీఎస్‌జీహెచ్ ఎంఏ సంయుక్తంగా నిర్వహించిన కృత్రిమ మేధా అనే అంశంపై 9వ తరగతి చదవుతున్న మౌనశ్రీ ద్వితీయస్థానం సాధించింది. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన మౌనశ్రీని బుధవారం ఈవో వాసవీదేవి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాఘవరావు తదితరులు అభినందించారు.

శివాలయంలో అన్నాభిషేకం

బోనకల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోనకల్ శివాలయంలో బుధవారం అన్నాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు లింగా కారానికి అన్నం అభిషేకంగా చేసి, భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. వేద మంత్రాలతో ప్రత్యేకాభిషేకాలు, పూజలతో శివాలయం ప్రాంగణం శివ నామస్మరణతో మారు మ్రోగింది. భక్తులు వేకువజామునే దేవాలయానికి చేరుకుని అక్కడ జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని, వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు.

16న కుమ్మర శాలివాహన ప్రజాపతి ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న సంఘ నాయకులు

సత్తుపల్లిరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వనభోజనాలతో ఆధ్యాత్మిక చింతనతో పాటు ఐక్యత భావం పెరుగుతుందనే ఉద్దేశ్యంతో ఈనెల 16న కుమ్మర శాలివాహన ప్రజాపతి నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కుమ్మర శాలివాహన ప్రజాపతి, ఉమ్మడి ఖమ్మం జిల్లా యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సత్తుపల్లి మండల, పట్టణ పరిధిలో నిర్వహించనున్నారు. ఈ వనభోజన కార్యక్రమం ఆదివారం ఉదయం కాకర్లపల్లి రోడ్డులోని పరుపుల ఫ్యాక్టరీ వెనుకవైపున గల నవ్వులూరి సూర్యచంద్రరావు తోటలో జరగనుంది. ఈ వనమహోత్సవానికి స్థానికులతో పాటు పలుప్రాంతాల్లో ఉద్యోగరీత్యా, ఉన్నత స్థానంలో నిలిచిన వారిని, సమాజానికి సేవలందించే వారిని ప్రత్యేకంగా గౌరవించుకుంటూ సన్మానించనున్నామని తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాలతో భోజనానంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుండగా కుమ్మర శాలివాహన, ప్రజాపతి కుటుంబ సభ్యులంతా సకాలంలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయాలి

తల్లాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి 700రోజులైనా హామీలు అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో అమలయ్యే వరకు సీపీఎం పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, శీలం ఫకీరమ్మ, ఎం.రామారావు, చల్లా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్, పారసాని వెంకటయ్య, పాటిబండ్ల సత్యనారాయణ, గండమాల ఆనందరావు, కట్టా దుర్గయ్య, అనుమోలు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఆర్‌సీవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్‌సీవో రాంబాబు

కొణిజర్ల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మపాలెం పంచాయతీ పరిధి మెయిన్‌రోడ్డు పక్కనగల మహాత్మ జ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకులాన్ని బుధవారం బీసీ గురకుల ఖమ్మం రీజనల్ కోఆర్డినేటర్ రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గదిని, వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంజిత్‌కుమార్, డిప్యూటీ వార్డెన్ నిర్మల, రెడ్డి భాస్కర్, తులసి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంగళరావు

ఏన్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తున్నామని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, జిల్లా కార్యదర్శి గంజి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని ఏహెచ్‌ఎస్ మూలపోచారం, ఏన్కూరు గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ సంఘం పిలుపు మేరకు రాష్ట్రస్థాయిలో మూడు దశల్లో పోరాటాలు నిర్వహిస్తున్నామని అందుకు ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని కన్వర్టెడ్ పాఠశాలకు పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భూక్యా భాస్కరరావు, పాయం శ్రీనివాసరావు, తాళ్లూరి వెంకటప్పయ్య పాల్గొన్నారు.

దేవాలయం అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐల భూరి విరాళం



విరాళం అందిస్తున్న నరేందర్‌రెడ్డి

తల్లాడ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని కుర్నవల్లి గ్రామంలోని వెంకట చలపతిస్వామి దేవాలయ అభివృద్ధికి పలువురు ఎన్‌ఆర్‌ఐలు రూ.13.66 లక్షల భూరి విరాళం అందించారు. దేవాలయం అభివృద్ధికి అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు శీలం వెంకట నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు శీలం నరేదర్‌రెడ్డి-స్వప్న దంపతులు రూ.6,11,116లు, అన్నదానానికి మరో రూ.2లక్షలు అర్చకుడు వరప్రసాదాచార్యులకు అందించారు. అలాగే దేవాలయంలో కళ్యాణ మండ పం నిర్మాణానికి శీలం పుల్లారెడ్డి కుమారుడు శీలం ఏసురెడ్డి-దివ్యవాణి దంపతులు రూ.5,55,551లు విరాళంగా అందించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యుడు శీలం నరేందర్‌రెడ్డి,అయిలూరి చిన్నకృష్ణారెడ్డి, వెంకట చలపతిరెడ్డి, స్వామాట్‌రెడ్డి, శేషిరెడ్డి పాల్గొన్నారు.

వెన్నవల్లి టు ఎర్రమాడు గ్రామాల మధ్య

ప్రమాదకరంగా వంతెన



వెన్నవల్లి గ్రామం వద్ద ఎన్ఎస్‌పీ కాల్వపై శిథిలమైన వంతెన

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండలంలోని వెన్నవల్లి గ్రామ వద్ద ఎన్ఎస్‌పీ మధిర బ్రాంచి కెనాల్‌పై గల వంతెన శిథిలమైంది. ఈ వంతెన సాగర్ కాల్వల నిర్మాణ సమయంలో గత నలభై ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ వంతెన ఆంధ్రా సరిహద్దున గల వెన్నవల్లి టు ఎర్రమాడు గ్రామాల మధ్యన ప్రధాన రహదారిపై ఉంది. దీంతో ఇటు తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు సంబంధించి పలు గ్రామాలకు రాకపోకలకు కొనసాగుతున్నాయి. ఈ వంతెనపై గల రహదారి నుంచి లారీలు, ఇతర మోటారు వాహనాలు నిత్యం వెళతుంటాయి. కాలక్రమంలో ఈ వంతెన ప్రమాదకరంగా మారటంతో వెన్నవల్లి గ్రామం వద్ద గ్రామ పంచాయతీ, ఎన్ఎస్‌పీ శాఖల ఆధ్వర్యంలో వంతెనపై ట్రాక్టర్ ట్రక్కును అడ్డుపెట్టి భారీ వాహనాలు ప్రవేశించకుండా అడ్డుకొని ప్రమాదాలు జరగకుండా ప్రస్తుతానికి చర్యలు తీసుకున్నారు. ఇలా ఆంధ్రా, తెలంగాణ సరిహద్దున అనుసందానంగా గల ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురతున్నారు. ఈ వంతెనకు శాశ్వత మరమ్మతులు గురించి ఎన్ఎ్ఎపీ, ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి అంచనా తయారు చేశారని సమాచారం. ఇప్పటికైన ప్రభుత్వ అధికారులు స్పందించి సాగర్‌కాల్వపై శిథిలమైన వంతెనకు శాశ్వత మరమ్మతులు జరిగేలా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

బాలల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



చిన్నకోరుకొండిలో బాలల పరిరక్షణ సమావేశం దృశ్యం

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాలలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో బుధవారం పలు ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్‌వర్కర్ అన్నపూర్ణ, హోమియో వైద్యుడు మారేబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ప్రభుత్వ పాఠశాల హెచ్ ఎం రమణలు ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామంలో 0 నుంచి 18 ఏళ్ల బాలల్లో అనాథ పిల్లలతో వారి సమస్యలను గురించి మాట్లాడటం జరిగింది. ప్రధానంగా బాల్య వివాహాల గురించి, అక్రమ దత్తత, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగింక వేధింపులు, డ్రాప్ అవుట్ పిల్లలకు అందించాల్సిన సహకారం, ప్రోత్సాహంపై సమీక్షించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.మహేష్ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్ఐ కుమ్మరి రామారావు, అంగన్వాడీ టీచర్స్ జీవీఎస్ పద్మ కుమారి, ప్రభావతి, అన్నపూర్ణ, యశోద, కె.ధమయంతి తదితరులు పాల్గొన్నారు.

వైరా ట్రాన్స్‌కో డీఈ కార్యాలయ పునర్ వ్యవస్థీకరణ



వైరా డీఈ కార్యాలయం

వైరా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరాలో గత తొమ్మిది ఏళ్ల కిందట ఏర్పాటుచేసిన ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్(డీఈ) కా ర్యాలయాన్ని పునర్వ్యవస్థీకరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి డీఈ కార్యాలయం ఉండాలని జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తీసుకున్న చర్యల్లో భాగంగా వైరా నియోజకవర్గ స్థాయిలో డీఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వైరా డివిజన్ పరిధిలో వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి మండలాలు ఉన్నాయి. ఇప్పటివరకు వైరా డివిజన్ కార్యాలయం పరిధిలో వైరాతోపాటు మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాలతో నూతనంగా మధిర డీఈ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం వైరా డీఈగా పనిచేస్తున్న బండి శ్రీనివాసరావును నూతనంగా ఏర్పాటుచేసిన మధిర డీఈ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో వైరా తాత్కాలిక డీఈగా ఖమ్మంలో డీఈ టెక్నికల్‌గా పనిచేస్తున్న వి.చిన్న బాబూరావును నియమించారు.

జర్నలిస్టు మోహన్ కుటుంబానికి ఆర్థిక సాయం



కల్లూరు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జర్నలిస్టు వేము మోహన్‌బాబు కుటుంబానికి జర్నలిస్టు మిత్ర బృందం తరఫున బుధవారం రూ.1లక్ష బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేశారు. మండలంలోని లింగాల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో సీనియర్ జర్నలిస్టు ఎస్‌కె అబ్దుల్ మునాఫ్ ఆధ్వర్యంలో సహచర మిత్రబృందం దర్నాసి బాలరాజు, వేము రాంబాబు, ఉబ్బన చంటిలు నగదు బాండును జర్నలిస్టు మోహన్ భార్య రాజకుమారి, కుమార్తె మధురలకు అందజేశారు. పలువురు దాతలు, విలేకరుల మిత్ర బృందం నగదు సహాయం చేశారు. ఈ సందర్భంగా మోహన్ చిత్రపటం వద్ద జర్నలిస్టు మిత్రబృందం ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో కల్లూరు జర్నలిస్టుల మిత్ర బృదం తరుపున కోట పుల్లయ్య, చెవుల నరేష్, భూక్యా శ్రీను, బొల్లం శంకర్, మేకల సాంబ, భూక్యా సురేష్, సీపీఐ మండల కార్యదర్శి దమాల దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ నిర్మాణ పనులు పరిశీలించిన రాయల



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాయల నాగేశ్వరరావు

ముదిగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం కమలాపురంలో నూతనంగా నిర్మిస్తున్న గిడ్డంగుల సంస్థ గోదాము నిర్మాణ పనులను ఆ సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో గోదాము నిర్మాణాన్ని పూర్తి చేయా లని ఆదేశించారు. కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి పను లను సకాలంలో పూర్తిచేసి అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శ్రీనివాస్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

సోషలిస్టు సమాజం కోసమే పోరాటాలు

వైరా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు సమాజం కోసం పోరాటంలో అమరులయ్యారని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు సీవై. పుల్లయ్య పేర్కొన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం, ప్రత్యేకించి 59ఏళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రజల కోసం ప్రజాతంత్ర సోషలిస్టు ఉద్యమం కోసం పోరాడి ఎందరో ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బుధవారం జరిగిన అమవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు, యలదండి బాబు, కె.దర్గయ్య పాల్గొన్నారు.

గంగారంలో నాకాబందీ

విస్తృతంగా వాహనాల తనిఖీలు.. కిలోమీటరు మేర నిలిచిన ట్రాఫిక్

పర్యవేక్షించిన ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



గంగారంలో వాహనాల తనిఖీలను పరిశీలించిన ఖమ్మం సీపీ సునీల్‌దత్

సత్తుపల్లిరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో చోటుచేసుకున్న పేలుడు ఘటన నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు తెలంగాణ- ఆంధ్రా సరిహద్దు ప్రాంతం సత్తుపల్లి మండలం గంగారంలో బుధవారం రాత్రి నాకాబందీ చేపట్టారు. ఈ సందర్భంగా ఖమ్మం సీపీ సునీల్‌దత్ వాహనాల తనిఖీని పర్యవేక్షించి కల్లూరు ఏసీపీ ఏ.రఘుకు పలు సూచనలు చేశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా బలోపేతం చేయడం లక్ష్యంగా విస్తృతంగా లాడ్జీలు, వాహనాల తనిఖీలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లు, సర్కిల్స్, సబ్-డివిజన్లు, నగర, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, రద్దీ ప్రదేశాల్లో, జంక్షన్లు, టోల్‌గేట్లు, బైపాస్ రోడ్లు, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో వాహనాలను ఆపి పత్రాలు, నంబర్ ప్లేట్లు, లైసెన్సులు పరిశీలిస్తున్నట్లు సీపీ చెప్పారు. కాగా కల్లూరు ఏసీపీ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలతోపాటు పోలీస్ సిబ్బందితో నాకాబందీ చేపట్టగా ఈ సందర్భంగా గంగారంలో జాతీయ రహదారిపై కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి.

మండల కేంద్రంలో సీసీ రోడ్లకు మహర్దశ

రోడ్ల నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు

కారేపల్లి నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సింగరేణి పంచాయతీలో సీసీ రోడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల వారికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శుభవార్త తెలిపారు. మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్ల 50 లక్షలతో ఎన్ఆర్ఐ ఈజీఎస్ ద్వారా ఏర్పాటు చేయనున్నారు. మండల కేంద్రంలో పలుప్రాంతాల్లో సీసీ రోడ్ల సౌకర్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాలకు చెందినవారు పలుమార్లు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దృష్టికి తీసుకురావడంతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు సైతం సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు రూ.2 కోట్ల 50లక్షల వ్యయంతో ఏర్పాటుకు ప్రదిపాదనలు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. మంజూరైన రోడ్లకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలోనే శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు రమేష్ స్మైల్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న రమేష్‌బాబు

పెనుబల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆయూష్ కరాటే ఆఫ్ ఇండియా నిర్వహించిన కరాటే పోటీల్లో రమేష్ స్మైల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదివారం నల్గొండ జిల్లా దేవరకొండలో నిర్వహించిన కరాటే పోటీల్లో పాఠశాలకు 8వ తరగతి విద్యార్థి పెరుమాళ్ల సాత్విక్ అండర్-14 విభాగంలో ప్రథమస్థానం, జూనియర్ విభాగంలో పెరుమాళ్ల రిత్విక్ ద్వితీయస్థానం సాధించాడు. శిక్షణనిచ్చిన మరకాల రేవంత్, విద్యార్థులను కరస్పాండెంట్ కురివేటి లలితా భవాని, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీఈటీ సుదీర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు తల్లాడ విద్యార్థి ఎంపిక



చరితేజ్

తల్లాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు తల్లాడ లూర్దుమాత ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.చరితేజ్ ఎంపికయ్యాడు. బుధవారం జరిగిన అండర్ 14 బాలుర 100మీటర్ల పరుగు పందెంలో చరితేజ్ ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైన చరితేజ్‌ను హెచ్‌ఎం సిస్టర్ ప్రసన్న, పీఈటీ జి.చలపతిరావు తదితరులు అభినందించారు.

క్రీడాకారిణి ఉమకు యలగొండ సన్మానం



ముదిగొండ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గంధసిరి గ్రా మానికి చెందిన బూయ్యా ఉమ రాష్ట్రస్థాయి 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని మొదటి స్థానం సాధించింది. అలాగే నేషనల్ స్థాయిలో జరిగిన 100, 1500, 400 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించినందుకు ఉమను ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండ స్వామి శాలువాతో సన్మానించి అభినందించారు. అలాగే క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చాలని ఆకాంక్షించారు.

మిరప పంటకు తెగుళ్లబెడద

నల్లతామర, ఎండు తెగులుతో రైతుల్లో ఆందోళన



మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఏన్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మిరప పంటకు ఎండుతెగులు, నల్లతామర బెడద ఎక్కువగా ఉంది. దీనివలన పంటలకు తీవ్ర నష్టం కలుగుతుంది. వైరా కేవీకే శాస్త్రవేత్తల బృందం రేపల్లేవాడ గ్రామంలో పర్యటించారు. తెగుళ్ల నివారణకు చర్యల గురించి రైతులకు వివరించారు.

ఎండుతెగులు లక్షణాలు :

తెగులు సోకిన మొక్కపై భాగంలోని ఆకులు లేత పసుపు రంగుకు మారి ఎండిపోతాయి. తర్వాత చెట్టు మొత్తం ఎండిపోతుంది. ఎండిన మొక్కలను పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణంలో నిలువు చారలు కాండం మొదలు భాగంలోను, వేర్లలోను కనిపిస్తాయి. ఈ తెగులు నివారణ 3గ్రాముల కాపర్ క్లోరైడ్, కాపర్ హైడ్రాక్సైడ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో పోయాలి. రెండు కేజీల ట్రైకోడెర్మా విరిడి 90కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండితో కలిపి నీరుచల్లి గోనె సంచులతో కప్పాలి. 15 రోజుల తర్వాత తెల్లని ఆకుపచ్చ శిలీంద్రం పెరుగుదల కనిపించగానే మిరప మొక్కల సాళ్లలో చల్లాలి.

తామర పురుగు

తామర పురుగుల యొక్క పిల్ల, తల్లి పురుగులు ఆకు అడుగుభాగంలో, పూలల్లో, కాయలపై ఆశించి రసాన్ని పీలుస్తాయి. దీనివల్ల పూలు వాడిపోయి, కాయ అభివృద్ధి చెందదు. కాయలపై ఆశించి రసాన్ని పీల్చడం కారణంగా కాయలు పొట్టిగా తయారవుతాయి. వంకర్లు తిరుగుతాయి.

నివారణ : నీలిరంగు జిగురు అట్టలను 25-35 ఎకరానికి చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. జీవ నియంత్రకాలైన బవేరియా బాసియానా 5మి.లీ. లేదా లెకాని, సీలియం లెకాని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. రసాయనిక పురుగు మందులైన పిప్రోనిల్ 5% ఎస్‌సీ 2మి.లీ. ఇమిడా క్లోప్రైడ్ 17.80% ఎస్ఎల్ 0.3లీ లేదా స్పైనోషా 45% ఎస్‌సీ 0.3గ్రాములు స్పైరోటెట్రా మ్యాట్ 15.31% డబ్ల్యూ/డబ్ల్యూడీ 08 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ 1.50% + పిప్రోనిల్ 03.30% ఎస్‌సీ 1మీ.లీ., టోల్ఫెన్‌పైరాయిడ్ 15% ఈసీ 2మి.లీ. హెగ్సీతయజాక్స్ 3.5%+ డైపెన్థియురాన్ 42% డబ్ల్యూడీజీ 1.3 గ్రా.లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో పిచికారి చేయాలని తెలిపారు.